ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శనివారం 30 ఆగస్టు 2025 | 5

భక్తజన సిద్ధివినాయకుడు

అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం భక్తులతో శుక్రవారం కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి సిద్ది వినాయకుడిని దర్శించుకున్నారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు స్వామిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

చిత్రం.. స్వామి వారికి లక్ష దూర్వార్చన పూజను నిర్వహిస్తున్న అర్చకస్వాములు

6








వరద ముంపులో చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వే.. పడవలపై గోదావరి దాటుతున్న లంక గ్రామాల వాసులు

కనకాయలంక కాజ్‌వేను ముంచెత్తిన వరద

పి.గన్నవరం, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి మళ్లీ వరదతాకిడి మొదలైంది. ఇప్పుడిప్పుడే సాధారణస్థాయికి చేరుకున్న నీటిమట్టం మళ్లీ పెరుగుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సముద్రంలోకి 8 లక్షలకుపైగా క్యూసెక్కుల వరదనీరును వదులుతుండడంతో జిల్లాలో మీదుగా వెళ్లే గౌతమి, వృద్ధ గౌతమి, వశిష్ఠ, వైనతేయ నదీపాయలు నిండుగా ప్రవహిస్తున్నాయి. పి.గన్నవరం మండల పరిధిలో చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వేను మూడోసారి వరద ముంచెత్తింది. కాజ్‌వే మొత్తం జలదిగ్బంధంలో చిక్కుకుంది. దీంతో అధికారులు కాజ్‌వేపై రాకపోకలు నిలిపివేశారు. గంటిపెదపూడి, ఉడిమూడి శివారు గ్రామాలైన బూరుగులంక, పెదపూడిలంక, అరిగెలవారిపేట, ఉడిమూడిలంక గ్రామస్తులు బూరుగు లంక నదీపాయపై ఏర్పాటుచేసిన పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు.

పాస్.. కాలేదు!



తప్పుల తడకగా పాస్ పుస్తకాలు

- ఉమ్మడి జిల్లాకు 3.44 లక్షలు
- 40 వేల పుస్తకాల్లో అన్నీ తప్పులే
- పంపిణీ తాత్కాలిక వాయిదా
- రైతాంగానికి మళ్లీ నిరాశ
- ఆన్‌లైన్‌లో సరిచేస్తున్న అధికారులు
- మార్చి కొత్తగా ఇవ్వాలని నిర్ణయం
- గత వైసీపీలో జగన్ బొమ్మ
- కూటమిలో ప్రభుత్వ రాజముద్ర

(కాకినాడ/సామర్లకోట, ఆంధ్రజ్యోతి)

పట్టాదారు పాసుబుక్‌లకు ఎదురుచూస్తున్న రైతులకు మళ్లీ నిరాశే మిగిలింది. గత వైసీపీ హయాం నుంచీ వీటికోసం అన్నదాతలు తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగని రోజు లేదు. ప్రభుత్వం మారాక ఎట్టకేలకు కొత్త పుస్తకాలు ముద్రణ పూర్తయి జిల్లాకు చేరుకున్నాయి. రేపో మాపో పుస్తకం చేతికి వస్తుందనుకున్న తరుణంలో వాటిలో చోటుచేసుకున్న భారీ తప్పులు అధికారులు, కొన్నిచోట్ల రైతులు గుర్తించారు. దీంతో అధికారులు వెనక్కు పంపేశారు. ఆన్‌లైన్‌లో వివరాలు సరిచేసి పంపుతున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు చేరుకున్న 3.44 లక్షల పాస్‌బుక్‌ల పంపిణీ నిలిపివేశారు.

40 వేల పుస్తకాలు వెనక్కి..

కాకినాడ జిల్లాలో 6,900 పాస్ పుస్తకాలు తప్పులు తడకగా మారాయి. ఉమ్మడి జిల్లా అంతా కలిపి 40 వేల వరకు పుస్తకాలు ఎందుకు పనికిరాకుండా మారాయి. ఇప్పటికే లాంఛనంగా పంపిణీ చేసిన చోట తప్పులు చూసి అన్నదాతలు లబోదిబోమనడంతో అవన్నీ వెనక్కు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వీటి పంపిణీని తాత్కాలికంగా వాయిదా వేసింది. తప్పులు దొర్లిన పాసు పుస్తకాలన్నింటినీ తాజాగా అమరావతికి వెనక్కు పంపేసింది. ఏ రైతు పుస్తకానికి సంబంధించి తప్పులున్నాయో వాటిని ఆన్‌లైన్ యాప్ ద్వారా సరిదిద్దుతున్నారు.ఈ వివరాల ఆధారంగా మళ్లీ కొత్త పుస్తకాలు రానున్నాయి. అన్ని వివరాలు సక్రమంగా ఉన్న పాసు పుస్తకాల పంపిణీ ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. త్వరలో ఎమ్మెల్యేల ద్వారా పంపిణీ చేయించాలని భావిస్తోంది.

వైసీపీలో ఇబ్బందే..

గత వైసీపీ ప్రభుత్వంలో రెవెన్యూ అస్తవ్యస్తంగా మారింది. రైతులు భూములు కొనుగోలు చేసి ఏళ్లు దాటినా కనీసం పాస్ బుక్‌లు ఇవ్వలేదు. వాస్తవానికి పాస్‌బుక్‌లు ఉంటేనే భూముల క్రయవిక్రయాలు, రైతులకు రుణాలు వస్తాయి. కానీ జగన్ సర్కారు అప్పట్లో ఇదేదీ పట్టించుకోలేదు. రైతులు పాస్‌పుస్తకాలకు తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఖాతరు చేయలేదు. అదే సమయంలో అప్పటి ప్రభుత్వం కొత్తగా 2022 సమగ్ర భూ సర్వే చేపట్టి అరాచకం సృష్టించింది. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు భూముల సర్వే 1920లో జరిగింది. దీని ప్రకారమే 2022 వరకు భూ క్రయవిక్రయ లావాదేవీలు జరిగాయి. 1920లో జరిగిన భూసర్వే 30 ఏళ్ల పాటు మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలి. ఆ తర్వాత మళ్లీ భూ రీసర్వే జరగాలి. కానీ అనేక కారణాలతో సర్వే జరగలేదు. వందేళ్ల తర్వాత గత వైసీపీ ప్రభుత్వం సర్వేశాఖ ద్వారా సమగ్ర భూ సర్వే చేయడానికి కసరత్తు జరిపింది. ఒక్కో సర్వే నెంబర్‌లో ఎంత మందికి భూములున్నాయనేది గుర్తించి సబ్‌డివిజన్ సర్వే నెంబర్ కొత్తగా కేటాయించాలని నిర్ణయించింది. కానీ ఆచరణలో అప్పటి ప్రభుత్వం విఫలమైంది. సర్వేపై విపరీతమైన ఒత్తిళ్లు తేవడంతో రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు అస్తవ్యస్తంగా ఈ ప్రక్రియను మార్చేశారు. ఉమ్మడి జిల్లాలో 600కు పైగా గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశారు. ఇందులో కాకినాడ జిల్లా 15 మండలాల పరిధిలో 269 గ్రామాలు, తూర్పుగోదావరి జిల్లా 19 మండ లాల్లో 190 గ్రామాలు, కోనసీమ జిల్లాలో 150కిపైగా గ్రామాల్లో సర్వే చేశారు. రీసర్వే తప్పుల తడకగా మారింది. వీటిని సరి చేయాలని ఉమ్మడి జిల్లాలో వేలాది మంది బాధితులు కాళ్లరిగేలా తిరిగినా ప్రభుత్వం పరిష్కరించలేదు. ఇదిలా ఉండగా సర్వే పూర్తయిన గ్రామాల్లో సొంత ప్రచారం కోసం జగన్ బొమ్మతో పాస్‌బుక్‌ల జారీకి అధికారులు ప్రయత్నించారు. ఇది కూడా తీవ్ర విమర్శలపాలైంది.

పొరపాట్లను సరిచేశారనుకుంటే..

ఈ పొరపాటును ప్రస్తుత కూటమి ప్రభుత్వం సరిదిద్దింది. కేవలం రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలను ముద్రించింది. ఇలా ఉమ్మడి జిల్లాకు కొత్తగా 3.44 లక్షల పాసు పుస్తకాలు వచ్చాయి. వీటిని తహశీల్దార్లు పరిశీలించి ఆగస్టు 15 నుంచి పంపిణీ చేయాలని నిర్ణయించారు. వీటిలో తప్పులు దొర్లాయని కొందరు వీఆర్వోలు గుర్తించి తహశీల్దార్ల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జిల్లా ఉన్నతాధికారులు రాష్ట్రస్థాయిలో సమాలోచనలు చేశారు. అనంతరం ఆగస్టు 15 నుంచి భూయజమానులకు పంపిణీ చేయాల్సిన పాసుపుస్తకాల పంపిణీ కొంతకాలం వాయిదా వేశారు. ప్రభుత్వం ముందుగా నిర్ణయించిన సమాచారం మేరకు ఇప్పటికే పది రోజుల సమయం దాటి పోయింది. అయినా కొత్త పాసుపుస్తకాలు ఎప్పటి నుంచి పంపిణీ చేస్తారో ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో జిల్లాలోని అన్ని తహశీల్దార్ల కార్యాలయాల్లో కొత్త పాస్ పుస్తకాలు తాత్కాలికంగా దాచి ఉంచారు.

ఇలా చేస్తే బెటర్..

వైసీపీలో రీసర్వే ప్రక్రియలో నాటి వీఆర్వోలు చేసిన తప్పిదాల కారణంగా పాసుపుస్తకాల్లో తప్పులు దొర్లాయి. ఇలా పునరావృత్తం కాకుండా ఉండాలంటే భూయజమానుల పేర్లు, రెవెన్యూ రికార్డులు సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశాలను థర్డ్ పార్టీ అధికారులతో సర్వే చేయించాలి. గతంలో వీఆర్వో ఫొటోతో కూడిన 1-బీ పత్రాలను రైతులకు పంపిణీ చేసేవారు. రైతుల నుంచి వాస్తవ సమాచార సేకరణ చేసేవారు. కానీ అలాకాకుండా ఆన్‌లైన్ వెబ్‌ల్యాండ్‌లో ఉన్న లోపాలతో ఉన్న పాసు పుస్తకాలను ము ద్రించి వాటినే తిరిగి పంపిణీ చేయడంతో తప్పుల తడకగా మారుతున్నాయి. ఆ ప్రక్రియకు వీఆర్వోలను వినియోగించకూడదని, రెవెన్యూలో సుదీర్ఘ అనుభవంగల ఒక తహశీల్దార్ స్థాయి అధికారి తెలిపారు. రెవెన్యూ రికార్డుల్లో సక్రమంగానే ఉన్నట్టు బయోమెట్రిక్ వేసిన రైతులకే పట్టా దారుపాసు పుస్తకాలు థర్డ్ పార్టీ అధికారులతోనే పంపిణీ చేయించాలంటున్నారు. తాజాగా వచ్చిన కొత్త పాసుపుస్తకాలు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ముద్రితమయ్యాయి.కొత్త పాసు పుస్తకాల్లో రైతు పొలం వద్దకు చేరేలా క్యూఆర్ కోడ్ ముద్రించడం విశేషం.

బార్.. బేజార్!



- బార్ పాలసీకి నిర్వాహకులు ఝలక్
- జిల్లాలో 9 బార్‌లకు దరఖాస్తులు ఆహ్వానం
- ఒకేఒక్క బార్‌కు లక్కీడిప్‌కు అర్హత
- అదీ అమలాపురం మున్సిపాలిటీ నుంచే
- నిర్వహణలో నష్టాలు.. మామూళ్లతో కష్టాలు
- నూతన పాలసీ అమలుతీరుపై నిరసన

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

నూతన ఎక్సైజ్ బార్ పాలసీ-2025-28 సంవత్సరానికి సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన మద్యం బార్‌ల పాలసీకి బార్ నిర్వాహకులు ఝలక్ ఇచ్చేశారు. ప్రభుత్వం పెట్టిన నూతన పాలసీలోని ఆంక్షలను తట్టుకోలేని నిర్వాహకులు లైసెన్సుల కోసం ఎవరూ దరఖాస్తు చేయలేని పరిస్థితితో కోనసీమ జిల్లాలోని ఎక్సైజ్‌శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వాస్తవానికి ఈ నెల 27వ తేదీకే బార్‌ల దరఖాస్తు గడువు ముగిసినప్పటికీ ప్రభుత్వం నిర్వాహకుల నుంచి స్పందన కరువవడంతో అదనంగా మరో రెండు రోజులు అంటే శుక్రవారం అర్ధరాత్రి వరకు గడువు పొడిగించినప్పటికీ మద్యం వ్యాపారులెవరూ ముందుకు రాకుండా ప్రభుత్వ పాలసీకి గట్టి షాకే ఇచ్చారు. జిల్లా పరిధిలో కేవలం అమలాపురం పురపాలక సంఘంలోని ఒకే ఒక్క బార్‌కు మాత్రం నాలుగు దరఖాస్తులతో లక్కీడ్రాలో పాల్గొనేందుకు అర్హత సాధించింది.

ఇదీ నూతన బార్ పాలసీ విధానం..

జిల్లాలో మొత్తం 11 బార్‌లకు ఈనెల 18న జారీ నోటిఫికేషన్ చేశారు. వీటిలో పర్యాటకశాఖ బార్‌తో పాటు మొత్తం తొమ్మిది బార్‌లు మున్సిపాలిటీల పరిధిలోను రెండు గీత కార్మికులకు కేటాయించారు. అయితే ప్రస్తుతం తొమ్మిది బార్‌లకు సంబంధించి అప్లికేషన్ ఫీజు, ప్రోసెస్ ఫీజు, మొత్తం బార్ నిర్వహణకు చెల్లించాల్సిన ఫీజులతో కూడిన వివరాలను జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్కేడీవీ ప్రసాద్ ఈ ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా పరిధిలో అమలాపురం మున్సిపాలిటీలో మూడు బార్‌లు, మండపేట మున్సిపాలిటీలో రెండు, రామచంద్రపురం మున్సిపాలిటీలో రెండు, ముమ్మిడివరంలో ఒకటి, పర్యాటక కేంద్రమైన దిండిలో ఒక బార్‌కు ఉత్తర్వులు జారీచేశారు. వీటికి సంబంధించి విధివిధానాలు వెల్లడించారు. జిల్లాలో 50వేలు పైబడిన మున్సిపాలిటీలుగా ఉన్న అమలాపురం, మండపేటల్లో బార్ నిర్వహణకు రూ.55లక్షలు చెల్లించాలి. 50వేలలోపు జనాభా కలిగిన రామచంద్రపురం, ముమ్మిడివరం, దిండి ప్రాంతాల్లో రూ.35 లక్షలు బార్ నిర్వహణ ఫీజు కింద చెల్లించాలనే నిబంధన విధించారు. ప్రతీ బార్‌కు నాలుగు అప్లికేషన్లు తప్పనిసరిగా వేయాలనే నిబంధనతోపాటు ప్రతీ అప్లికేషన్‌కు రూ.5 లక్షలు చెల్లించాలని ఉత్తర్వులిచ్చారు.

బార్ నిర్వాహకుల తీరిలా..

జిల్లాలో మొత్తం 9 బార్‌లు, 2 గీత కార్మికులకు బార్ అనుమతులకోసం ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులకు బార్ నిర్వాహకుల నుంచి కనీస స్పందన కరువైంది. జిల్లా పరిధిలోని తొమ్మిది బార్‌లకు ఒకేఒక దరఖాస్తు లాటరీకి అర్హత సాధించినట్టు సమాచారం. అందిన సమాచారం మేరకు జిల్లాలో మొత్తం 9 బార్‌లకు 22 మంది దరఖాస్తుదారులు అప్లికేషన్లు స్వీకరించారు. శుక్రవారం రాత్రి 9 గంటల సమయానికి కేవలం 4 దరఖాస్తులు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో నమోదయ్యాయి. శనివారం కలెక్టర్ సమక్షంలో తీసే లక్కీడ్రాకు కేవలం ఒకేఒక్క దరఖాస్తు.. అదీ అమలాపురం మున్సిపాలిటీ నుంచి ఓ బార్‌కు సంబంధించి నిబంధనల మేరకు నాలుగు దరఖాస్తులు వేయడంతో లక్కీడ్రాకు అర్హత సాధించింది. కాగా రామచంద్రపురం మున్సిపాలిటీలో 2 బార్‌లకు దరఖాస్తులు నిల్. మండపేటలోను 2 బార్‌లకు, ముమ్మిడివరంలో ఒక బార్‌కు, దిండిలో పర్యాటక బార్‌కు దరఖాస్తులు ఏమీ పడలేనట్టు తెలిసింది. ప్రభుత్వం ప్రకటించిన నూతన పాలసీ హైదరాబాద్ వంటి నగరాలను తలదన్నే రీతిలో ఉండడంతో తాము నష్టాలు ఎదుర్కోకతప్పదని భావించే ఈసారి వీరంతా ముఖం చాటేసినట్టు తెలుస్తోంది. రాజకీయ నేతలు, అధికారుల మామూళ్ల బెడద కూడా కుంగదీస్తుండడం మరో కారణం. దరఖాస్తులు ప్రక్రియ పూర్తయ్యే దాకా ఈ సమాచారాన్ని వెల్లడించలేమని సూపరింటెండెంట్ ప్రసాద్ చేతులెత్తేశారు.

జైసమైక్యాంధ్ర పార్టీ ప్రతినిధులు విచారణకు హాజరు కావాలి

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2019 నుంచి గత ఆరేళ్లుగా ఒక్క ఎన్నికల్లో కూడా పోటీచేయని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సెప్టెంబరు 8న అమరావతిలో నిర్వహించే సమావేశంలో విచారణకు హాజరు కావాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. జైసమైక్యాంధ్ర పార్టీ జిల్లాలో ఒక్క ఎన్నికల్లో కూడా ఆరేళ్ల కాలంలో పోటీ చేయలేదన్నారు. ఆ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమరావతిలో జరిగే విచారణకు హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. ఆరోజు విచారణకు హాజరుకాని పక్షంలో ఎటువంటి సమాచారం లేదని భావించడం జరుగుతుందన్నారు. ఆ పార్టీకి ఎటువంటి సమాచారం లేకుండా చర్యలు తీసుకుంటారని తెలిపారు.

భూగర్భ జలాలను పెంచాలి : కలెక్టర్



వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న మహేష్‌కుమార్

అమలాపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మానవాళి మనుగడలో నీటి సంరక్షణ ఎంతో కీలకంగా ఉంటుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. వర్షపు నీటిని నిల్వచేసి వ్యవసాయానికి తాగునీటి అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జలవనరులు, భూగర్భశాఖ, ఆర్‌డబ్ల్యుఎస్‌శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. మైనర్ ఇరిగేషన్ చెరువుల మరమ్మతులు, పూడికతీతలు, పునరుద్ధరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో రానున్న వారం రోజుల్లో 29 పనులకుగాను ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం విభాగ ఆధీనంలో ఉన్న 17 తాగునీటి చెరువుల అభివృద్ధి ద్వారా అదనంగా ప్రజలకు లబ్ధి చేకూరే విధంగా ప్రతిపాదనలు రూపకల్పన చేయాలని సూచించారు. నాలుగు గ్రామాల్లో భూగర్భ జలాల పెంపునకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలతో వర్షపునీటి సంరక్షణ అంశం కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. చెరువుల్లో అడుగున పేరుకుపోయిన మట్టి, ఇసుక, ఇతర వ్యర్థాలను తొలగిస్తూ నీటి నిల్వల సామర్థ్యాన్ని పెంపొందించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్‌ఈ గోపీనాథ్, డీఈ వెంకటేశ్వరరావు, సీపీవో మురళీకృష్ణ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకుడు ఎస్.మధుసూదన్, పంచాయతీరాజ్ ఎస్ఈ రామకృష్ణారెడ్డి, భూగర్భ జలశాఖ డీడీ ఉమాదేవి, వివిధ శాఖల అధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో సైతం పింఛను పంపిణీ

ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీకి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మహేష్ కుమార్ ఎంపీడీవోలను ఆదేశించారు. నియోజకవర్గాల్లో ప్రత్యేకాధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలకు ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా పింఛన్ల పంపిణీపై పలు సూచనలు చేశారు. భారీ వర్షాలు, వరదలను ఎదుర్కొనేందుకు సన్నద్ధత చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈనెల 30వ తేదీ శనివారం బ్యాంకుల నుంచి పింఛను సొమ్మును విత్‌డ్రా చేసి, నిధులు భద్రపరిచి సోమవారం ఉదయాన్నే యథావిధిగా అందరికీ పింఛన్లు పంపిణీ చేయాలని సూచించారు. దివ్యాంగుల పింఛన్ల పంపిణీకి సంబంధించి పునర్విచారణ చేయాలని ఆదేశించిన దృష్ట్యా ప్రస్తుత మాసంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా పింఛన్లను అందజేయనున్నట్టు చెప్పారు. జిల్లాలో 27 కేటగిరీల్లో రూ.101 కోట్లను పింఛన్ల రూపంలో ప్రజాప్రతినిధుల సమక్షంలో పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కె.మాధవి, లీడ్ బ్యాంకు మేనేజర్ కేశవ వర్మ, డీఆర్డీఏ పీడీ గాంధీ, డీఎంహెచ్‌వో ఎం.దుర్గారావు, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ పద్మనాభం పాల్గొన్నారు.

కొత్తరూపు

- సచివాలయ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం చర్యలు
- మూడంచెల విధానం అమలుకు శ్రీకారం
- రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు కార్యాలయాల ఏర్పాటు



(ఆంధ్రజ్యోతి-అమలాపురం రూరల్)

మరింత పారదర్శకంగా ప్రజలకు సేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. క్షేత్రస్థాయిలో సచివాలయ వ్యవస్థను ఇంకా బలోపేతం చేయనుంది. రాష్ట్రస్థాయి నుంచి మండల స్థాయి వరకు మూడంచెల విధానంలో సచివాలయ వ్యవస్థను ప్రజల ముందుకు తీసుకురానుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందించడంతోపాటు ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత చేరువ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి కాటమనేని భాస్కర్ జీవో నెం.10ని విడుదలచేశారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ సచివాలయాలు, పట్టణ ప్రాంతాల్లో వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఈ పాలనా వ్యవస్థను మరింత మెరుగుపరచడంతో పాటు కేంద్ర కార్యాలయానికి అనుసంధానం చేయనున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో మాత్రమే గ్రామ, వార్డు సచివాలయ కార్యాలయాలు ఉన్నాయి. వాటికి పూర్తిస్థాయి సిబ్బంది కూడా లేరు. సిబ్బందిని భర్తీ చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం మండల స్థాయిలో సైతం సచివాలయ కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు తాజాగా నిర్ణయించింది. ఇవి మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటుకానున్నాయి. ఇక పురపాలక సంఘ పరిధిలో ఆయా మున్సిపల్ కార్యాలయాల్లోనే ప్రత్యేక విభాగంగా వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేయనున్నారు.

సిబ్బంది నియామకానికి ఉత్తర్వుల జారీ

పాలనా వ్యవస్థను మరింత మెరుగు పరిచేందుకు సచివాలయ వ్యవస్థలో సమూల మార్పులకు ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా స్థాయిలో ఇప్పటివరకు నామమాత్రంగా జీఎస్‌డబ్ల్యుఎస్ కార్యాలయంలో సిబ్బంది ఉండేవారు. అంతేకాకుండా డీఎల్డీవోల్లో సీనియర్‌ను జిల్లా అధికారిగా నియమించారు. ఇప్పుడు ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల మేరకు జిల్లా కార్యాలయంలో ప్రత్యేకంగా పది మంది సిబ్బందిని నియమించనున్నారు. జీఎస్‌డబ్ల్యుఎస్ జిల్లా అధికారిగా జాయింట్ డైరెక్టర్ కేడర్ అధికారిని నియమించనున్నారు. ఆయనతో పాటు పరిపాలనాధికారి, సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు టెక్నికల్ కోఆర్డినేటర్లు, నలుగురు జూనియర్ అసిస్టెంట్లతోపాటు ఆఫీస్ సబార్డినేట్‌ను నియమించనున్నారు. ఆఫీస్ సబార్డినేట్ పోస్ట్‌ను అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నారు. మిగిలిన తొమ్మిది పోస్టులను డిప్యుటేషన్‌పై భర్తీ చేస్తారు. టెక్నికల్ కోఆర్డినేటర్లుగా సచివాలయాల్లో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ క్యాడర్, పంచాయతీ కార్యదర్శులను నియమించనున్నారు. ఇక మండలస్థాయిలో జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారిగా గెజిటెడ్ అధికారిని నియమించనున్నారు. ఆయనతోపాటు ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లను నియమించనున్నారు. అలాగే పట్టణ ప్రాంతంలోను జీఎస్‌డబ్ల్యుఎస్ కార్యాలయంలో ఆరుగురిని నియమించనున్నారు. అసిస్టెంట్ కమిషనర్, మేనేజర్, సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఒక టెక్నికల్ కోఆర్డినేటర్‌ను నియమించనున్నారు. సిబ్బంది నియామకం కోసం సంబంధిత శాఖల అధికారులకు ప్రభుత్వం ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేసింది. డిప్యుటేషన్ విధానంలో ఆయా పోస్టులను భర్తీ చేసి జీఎస్‌డబ్ల్యుఎస్ వ్యవస్థను పూర్తిస్థాయిలో బలోపేతంచేసి రాష్ట్ర కార్యాలయానికి అనుసంధానం చేయనున్నారు. జిల్లాలో 515 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వాటిలో 48 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఆయా సచివాలయాల సిబ్బందిని డిప్యుటేషన్లపై మండల, జిల్లా జీఎస్‌డబ్ల్యుఎస్ కార్యాలయాల్లో భర్తీచేసేందుకు ఉత్తర్వులిచ్చారు.



తెలుగు.. వెలుగులు

తెలుగు భాష మనది.. నిండుగ వెలుగు భాష మనది.. నిజమే మరి.. తెలుగుకు ఎంతో మంది కవులు వన్నెతెచ్చారు.. తేట తేట తెలుగులా అంటూ కీర్తించారు.. ఆ కవులందరినీ ఒకసారి చూడగలమా.. కాస్త కష్టమే..అందుకే అమలాపురం రూరల్ వన్నెచింతలపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని వంద మంది తెలుగు కవుల చిత్రపటాలు మన ముందుకు తెచ్చారు.. తెలుగు కీర్తి చాటారు. - **అమలాపురం రూరల్**

భక్తజన సిద్ధివినాయకుడు



అయినవిల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం భక్తులతో కిక్కిరిసింది. వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి సిద్ధివినాయకుడిని దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు ఆలయ ప్రధానార్చకుడు బ్రహ్మశ్రీ మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించారు. లక్ష దూర్వార్చన పూజ నిర్వహించారు.మూషిక వాహనంపై స్వామివారికి మాడవీధుల్లో గ్రామోత్సవం జరిపారు. మణికంఠ స్వీట్స్ స్వీట్ల వితరణ, చేమకూర శ్రీను, భద్రం బ్రదర్స్‌చే పులిహోర, భావిశెట్టి రాంబాబు, తాతాజీ బ్రదర్స్ చక్కెరపొంగలి ప్రసాదం వితరణ జరిగాయి. కోనసీమ విద్యాశ్రమం(ముక్తేశ్వరం) విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు.

గణేశుడి ప్రతి.. రూపాయు!

పలు దేశాల నాణేలపై వినాయకుడి ప్రతిరూపాలు

అమలాపురానికి చెందిన కృష్ణ కామేశ్వర్ సేకరణ



ఐవరీకోస్ట్ దేశం ముద్రించిన రావి ఆకుల గణపతి నాణెం



కుక్ ఐలాండ్స్ దేశం ముద్రించిన బంగారుపూత వినాయకుని నాణెం



గింగీ నాయకులు ముద్రించిన గణపతి రాగినాణెం

అందుగలడు.. ఇందులేడని సందేహము వలదు..ఎందెందు వెతికినా గణేశుడే కదా.. గణపతిపూజ మన దేశానికి మాత్రమే పరిమితం కాలేదు. ప్రపంచంలోని ఎన్నో దేశాల్లో విఘ్నేశ్వరుడు పూజలు అందుకుంటున్నాడని చెప్పడానికి ఆయా దేశాల కరెన్సీ నోట్లపై ఉన్న గణేశుడి రూపమే నిదర్శనం. అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన ప్రముఖ నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణకామేశ్వర్ ప్రపంచ వ్యాప్తంగా గణేశుడి ముఖ చిత్రాలతో విడుదల చేసిన కరెన్సీ నోట్లు, నాణేలు సేకరించారు. పూర్వం నాణేలపై కూడా వినాయకుడి రూపాలే ముద్రించారు. ఇండోనేషియా దేశం ముద్రించిన రూ.20 వేల కరెన్సీ నోట్లపై విద్యాగణపతిని ముద్రించారు. 2013లో ఐవరీకోస్ట్ దేశం ముద్రించిన రావి ఆకుల గణపతి నాణెం నేటికీ ప్రత్యేకమే. ఇక 2018లో తువాలు దేశం నృత్యగణపతి ముఖచిత్రంతో ముద్రించిన అల్యూమినియం, బ్రాంజి, వెండి నాణేలు ఆకర్షణీయంగా ఉన్నాయి. 2019లో కుక్ ఐలాండ్స్ దేశం 93.3 గ్రాముల వెండి నాణెంపై బంగారు పూతతో వినాయకుడి నాణేన్ని ముద్రించారు. 2011లో థాయ్‌లాండ్ దేశం వినాయకుని ముఖచిత్రంతో 10 బాట్ల నాణెం విడుదల చేసింది.1509లో విజయనగర సామ్రాజ్యానికి విధేయులై తంజావూరు, మదురై ప్రాంతాలను పాలించిన గింగీ నాయకులు ఒక కాసు రాగినాణెంపై వినాయకుని ముఖ చిత్రంతో ముద్రించారు. ఇలా ఎన్నో దేశాల్లో గణపతి రూపాలతో కరెన్సీ నోట్లు, నాణేలను ముద్రించారు.

- అమలాపురం రూరల్ -ఆంధ్రజ్యోతి



థాయ్‌లాండ్ ముద్రించిన వినాయకుడి నాణెం



ఇండోనేషియా ముద్రించి రూ.20 వేల నోటు





తువాలు దేశం ముద్రించిన నృత్యగణపతి నాణెం

చనిపోయినా.. చూడొచ్చు!



నేత్రదానంతో అంధులకు వెలుగులు

- ఎవరైనా నేత్రదానం చేయవచ్చు
- అంధులకు చూపు ప్రసాదించవచ్చు
- చనిపోయిన 6 గంటల్లోపే కార్నియా తీయాలి
- నేత్రదాన పక్షోత్సవాలు

అంబాజీపేట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మనం చనిపోతే మనతో పాటు శరీరం అంతా భూమిలో కలిసిపోవాల్సిందేనా..! మన చనిపోయినా బతికే ఉండొచ్చు..! అదెలాగంటే మన అవయవాలను దానం చేయడం ద్వారా.. సర్వేంద్రియానాం..నయనం ప్రధానం అంటారు.. అందుకే పుట్టుకతో అంధత్వం గల వారితో పాటు పలు కారణాలతో మధ్యలో చూపు కోల్పోయిన వారిని సమాజంలో ఎంతో మందిని చూస్తుంటాం. మరణించిన తర్వాత నేత్రదానం చేసి అటువంటి వారి జీవితాల్లో వెలుగులు నింపవచ్చు. సెప్టెంబరు 8 వరకూ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ప్రత్యేక కథనం...

చిన్న పొరపాటు చాలు..

ఆహారంలో విటమిన్ ఏ, డీ లోపించడం.. పోషకాహార లోపంతో కంటి జబ్బులు వస్తున్నాయని వైద్యులు సూచిస్తున్నారు. కార్నియా అంటే పలుచటి పారదర్శక పొర. ఇది కంటిలో కనుపాప ముందుంటుంది. ఇన్‌ఫెక్షన్ ద్వారా, దెబ్బతగలడం ద్వారా, పోషకాహార లోపంతో ఈ పారదర్శక పొర దెబ్బతిని చూపు మసకబారుతోంది.తెల్లని పొర ఏర్పడడంతో కంటిచూపు కోల్పోతారు. పుట్టుకతోనే(తల్లిగర్భంలో) ఇన్‌ఫెక్షన్ రావడంతో నల్లగుడ్డు ఏర్పడే సమయంలో అది తెల్లబడి ఉంటుంది. వైరల్, ఫంగల్, బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్, పసరు కంటిలో పోయడంతో కంటి చూపు దెబ్బతింటుంది. కళ్లను గాయాల నుంచి కాపాడుకోవాలి. కత్తెర, కత్తి, సూది, టపాసులు, యాసిడ్‌లు వంటి వస్తువులు పిల్లలకు అందకుండా ఉంచాలి.

40 వేలే కార్నియాల సేకరణ

ప్రతి ఏటా లక్షలాది కళ్ళు అవసరం ఉండగా కేవలం 40 వేల కార్నియాల సేకరణ మాత్రమే సాధ్యపడుతోంది. కార్నియా జబ్బుతో బాధపడి కంటిచూపు కోల్పోయిన వారు దేశంలో లక్షకు పైగా ఉన్నట్టు అధికార గణాంకాలను బట్టి తెలుస్తుంది.వీరికి కార్నియా మార్పిడి చేస్తే మళ్లీ ఈ అందమైన లోకాన్ని చూసే అదృష్టం కలుగుతోంది.ఆ అదృష్టాన్ని వారికి ఎవరైనా ప్రసాదించవచ్చు.చేయాల్సిందల్లా మన చుట్టూ ఉన్న వారిలో ఎవరైనా చనిపోతే వారి నేత్రాలు దానం చేయడానికి కుటుంబీకులను ఒప్పిస్తే సరి.ఏవయసు వారైనా నేత్రదానం చేయవచ్చు.

నేత్రదానానికి వీరు అర్హులు..

వయసుతో నిమిత్తం లేకుండా ఎవరైనా నేత్రదానం చేయవచ్చు. ప్రమాదవశాత్తు గుండెజబ్బులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మరణించిన వారు, సహజ మరణం పొందిన వారు నేత్రదానానికి అర్హులు.మధుమేహం, రక్తపోటు, వ్యాధిగ్రస్తులు మరణానంతరం నేత్రదానం చేయవచ్చు.ఎయిడ్స్, కుక్కకాటుతో మరణించిన వారు, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు, దీర్ఘకాలం కోమాలో ఉన్న వారి నేత్రాలు పనికిరావు. ఇతర ఏ వ్యాధులైనా నేత్రదానం చేయవచ్చు. మరణించిన వ్యక్తి నుంచి మాత్రమే నేత్రాలను సేకరిస్తారు.వీటిని సేకరించడానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు ఐ బ్యాంక్‌లు ఏర్పాటు చేశారు.ఈ నేత్రాలను ఉచి తంగా వైద్యులు, ఐ బ్యాంక్ టెక్నీషియన్ సేకరిస్తారు. ఒక వ్యక్తి మరణించిన 6 గంటల్లోపు నేత్రాలు సేకరిస్తారు. ఐబ్యాంకులకు సమాచారమిస్తే వారు వచ్చి 10 నుంచి 15 నిమిషాల్లో చనిపోయిన వారి నేత్రాలు సేకరిస్తారు.నేత్రదానం వల్ల అంతిమ సంస్కారాలకు ఎలాంటి ఆటంకం ఉండదు.

బొగ్గుసొరను కాపాడుకుందాం

- తీరప్రాంత మత్స్యకారులకు అటవీశాఖాధికారుల అవగాహన కార్యక్రమాలు



తాళ్లరేవు మండలంలోని తీరప్రాంతంలో బొగ్గుసొర నమూనా

తాళ్లరేవు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో అరుదైన భారీ చేప బొగ్గుసొర ఆవశ్యకతపై అటవీశాఖాధికారులు మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్నారు. తీరప్రాంత మండలాల్లోని మత్స్యకార గ్రామాల్లో సముద్రంలో వేటచేసే మత్స్యకారులకు ఆరురోజులపాటు ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏటిమొగ కుంభాభిషేకం ప్రాంతంలో అటవీశాఖాధికారులు శుక్రవారం ప్రపంచ బొగ్గుసొర దినోత్సవం నిర్వహించారు. మత్స్యకారులు చేపలవేటకు వెళ్లినప్పుడు సాదు స్వభావంగల బొగ్గుసొరను పట్టడం లేదా వాటికి హాని కలిగించే పనులు చేయడం వంటివి చేయకూడదని సూచించారు. ఇది సముద్రాన్ని శుభ్ర పరుస్తుందని, చేపలవేటకు మత్స్యకారులకు మేలు చేస్తుందని, అందుకని దీన్ని కాపాడేందుకు అందరి భాగస్వామ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో అటవీశాఖాధికారులు సిద్దార్థ, ధనంజయరావు, మహేష్, గోపి, సంధ్యారాణి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల.. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి

- 1,584మంది అభ్యర్థుల ధ్రువీకరణపత్రాల పరిశీలన
- హాజరుకాని 34మంది అభ్యర్థులకు ఫోన్‌లో సమాచారం
- వారి కోసం తనిఖీ బృందాలకు తప్పని ఎదురుచూపులు



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న విద్యాశాఖ ఏడీ రామలింగం, డీఈవో రమేష్

గొల్లప్రోలురూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మెగాడీఎస్సీ-2025 మెరిట్‌లిస్టులో ఉన్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన అభ్యర్థులకు గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండురోజులుగా జరుగుతున్న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ శుక్రవారం అర్ధరాత్రి పూర్తయింది. వివిధ కారణాలతో హాజరుకాని 34మంది అభ్యర్థులకు ఫోన్‌లో సమాచారం అందించి వెరిఫికేషన్‌కు రావాలని సూచించి వారి కోసం ఎదురుచూడాల్సి రావడంతో కొంత జాప్యం చోటు చేసుకుంది.

పెరిగిన అభ్యర్థుల సంఖ్య

మెరిట్‌లిస్టులో ఉన్న అభ్యర్థుల ధ్రువీకరణపత్రాల తనిఖీ కోసం ఏర్పాటు చేసిన 25 తనిఖీ బృందాలు రెండురోజులు రాత్రింబవళ్లు ఈ ప్రక్రియలో నిమగ్నమయ్యాయి. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2గంటల వరకూ 1,018 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తిచేయగా శుక్రవారం రాత్రి 8గంటలకు హాజరైఉన్న మరో 566మంది అభ్యర్థుల పరిశీలన పూర్తిచేశారు. కాల్‌లెటర్‌లు జనరేట్ అయిన అభ్యర్థుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. శుక్రవారానికి ఈ సంఖ్య 1,351మంది నుంచి 1,618మందికి చేరుకుంది. ఎంఈవో, గెజిటెడ్ హెచ్‌ఎం, డిప్యూటీ తహసీల్దారు, ఎంఐఎస్ ఆపరేటర్ సభ్యులుగా ఉన్న బృందాలు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన, ఫిజికల్‌గా తీసుకువచ్చిన సర్టిఫికెట్లను పరిశీలించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేశారు.

ఫోన్‌లో సమాచారం

1618మంది అభ్యర్థులకు 1584మంది అభ్యర్థులు మాత్రమే సర్టిఫికెట్లు వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. మిగిలినవారు ఆన్‌లైన్‌లో తమకు కాల్‌లెటర్ జనరేట్ అయిన సమాచారం చూసుకోకపోవడం,ఇతర సాంకేతికపరమైన కారణాలతో హాజరుకాలేనట్లు గుర్తించిన అధికారులు వారికి మరొక అవకాశం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. అలా హాజరుకాని 34మంది అభ్యర్థులకు సంబంధించి తమవద్ద ఉన్న వివరాల ఆధారంగా ఫోన్‌చేసి తక్షణం పరిశీలనకు హాజరు కావాలని సమాచారం అందించారు. దీంతో కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మారుమూల ప్రాంతాలకు చెందినవారు అప్పటికప్పుడు బయలుదేరారు. వీరికోసం తనిఖీ బృందాలు అర్ధరాత్రి వరకూ వేచి చూసి తనిఖీ పూర్తిచేశాయి. తమకు తెలియకున్నా విద్యాశాఖాధికారులు ఫోన్‌లో సమాచారం ఇచ్చి తనిఖీకి రమ్మని చెప్పడంతో సదరు అభ్యర్థులు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.

ఉన్నతాధికారుల పరిశీలన

సర్టిఫికెట్ల పరిశీలన రెండు రోజులు తనిఖీ బృందాలతోపాటు విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ మువ్వా రామలింగం, కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్, డీసీఈబీ కార్యదర్శి వెంకట్రావులు అక్కడే ఉండి స్వయంగా పర్యవేక్షించారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను పరిశీలించారు. వీరికి ఉమ్మడి జిల్లాకు చెందిన డీఈవోలు, డీవైఈవోలు సహకారం అందజేశారు.

56 అక్షరాల వాగ్దేవతా చిత్రపటాల ప్రదర్శన



చెముడలంకలో 56అక్షరాల వాగ్దేవతా చిత్రపటాలతో విద్యార్థులు

ఆలమూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చెముడలంక షిర్డిసాయి విద్యానికేతన్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా జరిపిన ఈ కార్యక్రమంలో 56 తెలుగు అక్షరాల వాగ్దేవతా చిత్రపటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రతి అక్షరానికి ఒక ఆదిదేవత ఉంటుందని, అవన్నీ బీజాక్షరాలని షిర్డిసాయి విద్యానికేతన్ డైరెక్టర్ ఉమారాణి అన్నారు. 56 చిత్రపటాలకు విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు.

కాకినాడ ఆర్‌ఎంసీలో జీఎన్‌ఎం నర్సింగ్ పరీక్షల్లో

కాపీయింగ్ ఆరోపణలపై విచారణ

జీజీహెచ్(కాకినాడ),ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్‌ఎంసీలో నిర్వహిస్తున్న జీఎన్‌ఎం నర్సింగ్ పరీక్షల నేపథ్యంలో జరిగిన కాపీయింగ్ ఆరోపణలపై శుక్రవారం విచారణ జరిగింది. డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీ ఏర్పడింది. ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ శశి, నర్సింగ్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉమాసుందరి సభ్యులుగా ఈ కమిటీ నడిచింది. ఇందులో 30మందిని విచారించారు. ఇందులో ఇన్విజిలేటర్లు, జీజీహెచ్ నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ సహా సీనియర్ అసిస్టెంట్ ఏసుబాబు ఉన్నారు. ఆర్‌ఎంసీ డైనింగ్ హాల్‌లో ఈ విచారణ జరిగింది. కాపీయింగ్ జరిగిందా లేదా జరిగితే కారణాలు ఏంటన్న కోణంలో విచారణ చేపట్టారు. అనంతరం నివేదికను సీసీ ఫుటేజ్ ఆధారాలతో విచారణ కమిటీ డీఎంఈకి సమర్పించింది.

తెలుగు భాష వ్యాప్తి కోసం

కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది

- ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్
- ఐడియల్ కళాశాలలో ముగిసిన తెలుగు భాషా సాహిత్య ఉత్సవాలు



రచయిత రవి మంత్రిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ పేరాబత్తుల, ఐడియల్ కళాశాల కరస్పాండెంట్, డైరెక్టర్

కాకినాడరూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తెలుగుభాష వ్యాప్తికోసం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడియల్ డిగ్రీ కళాశాలల్లో ఐదురోజుల పాటు నిర్వహించిన డాక్టర్ పి.చిరంజీవినీకుమారి స్మారక తెలుగుభాషా సాహిత్య ఉత్సవాలు తెలుగు భాషా దినోత్సవంతో శుక్రవారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో గౌరవఅతిథిగా ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, ముఖ్యఅతిథిగా రచయిత రవి మంత్రి పాల్గొన్నారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల మాట్లాడుతూ చదువుల్లో భాషకు ప్రాధాన్యం ఉండాలని, తమ తరం విద్యార్థులు మైళ్ల దూరం నడిచి వెళ్లి చదువుకోవాల్సి ఉండేదని, ఇప్పటి విద్యార్థులకు చదువు కోసం అన్ని సదుపాయాలు ఉన్నాయని అన్నారు. అనంతరం రవి మంత్రి మాట్లాడుతూ కొత్త తరం యువతీ, యువకుల్లో తెలుగుభాష, సాహిత్య అధ్యయన స్పృహ పెంచేందుకు తన రచనల ద్వారా కృషి చేస్తున్నానన్నారు. తెలుగు వారి భాష, భావం వెనకబడలేదని, తన నవల లక్షా50వేల కాపీలు అమ్ముడవడమే దీనికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లోని విజేతలకు అతిథులు ప్రతిభా పత్రాలను, బహుమతులను అందజేశారు. స్థానిక సెయింట్ జేవియర్స్ హైస్కూల్ విద్యార్థులు పాటలు, క్విజ్ పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించారు. ఐడియల్ కళాశాలల కరస్పాండెంట్, కార్యదర్శి పీఎస్‌ఎస్ కిరణ్, అకడమిక్ డైరెక్టర్ మెర్ల రంజిత్ అతిథులను, ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ అధ్యక్షత వహించగా పి.పద్మజావాణి, భారత లక్ష్మి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ కేఎస్ వాసు, చింతపల్లి సుబ్బారావు, మార్ని జానకి రామ్‌చౌదరి, పి.సుబ్బారావు, కె.దుర్గాప్రసాద్, శిరీష్ పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా దివ్యాంగుల క్రికెట్ జట్టు ఎంపిక

సామర్లకోట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు ఆదేశాలమేరకు దివ్యాంగుల క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, గ్రామస్థాయి నుంచి క్రికెట్ క్రీడను అభివృద్ధి చేసేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, దివ్యాంగుల క్రికెట్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబరు 12 నుంచి 14 వరకూ కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల మైదానంలో స్వర్ణాంధ్ర ఇంక్లూసివ్ క్రికెట్ కప్-2025 నిర్వహిస్తున్నట్లు ఏపీఏ దివ్యాంగుల క్రికెట్ కమిటీ ఛైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ,టోర్నమెంట్ నిర్వహణ కమిటీ కన్వీనర్ చిత్తులూరి వీర్రాజు(రాజా) తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈటోర్నమెంట్‌లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఆతిథ్య జట్టు తూర్పుగోదావరి జట్టు పాల్గొంటాయన్నారు. పాల్గొనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు ఎంపిక 31న కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల గ్రౌండ్‌లో ప్రారంభిస్తామన్నారు. ఎంపికైన క్రీడాకారులు మాత్రమే తూర్పుగోదావరి జిల్లా జట్టు తరఫున పోటీలో పాల్గొంటారని కన్వీనర్ చిత్తులూరి రాజా తెలిపారు. వివరాలకు 8498877877, 9440121865 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

తేటగుంట కెనరా బ్యాంకు ఎదుట ఖాతాదారుల ఆందోళన


బ్యాంకు ఎదుట నిరసన తెలుపుతున్న దృశ్యం

తునిరూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట కెనరా బ్యాంకుకు చెందిన గోల్డ్ అప్రోచర్ రామోజుల రాజశేఖర్ జైలుకెళ్లి బయటకు వచ్చినప్పటికీ తమ బంగారం తమకు ముట్ట లేదని, బ్యాంక్ అధికారులు, గోల్డ్ అప్రోచర్ ఉద్దేశపూర్వకంగానే తమను తప్పుదోవ పట్టిస్తున్నారని ఖాతాదారులు ఆరోపిస్తూ శుక్రవారం తేటగుంట కెనరా బ్యాంకు ఎదుట ఖాతాదారులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. తమ బంగారం ఇచ్చే వరకు కదిలేది లేదంటూ ఆందోళన చేపట్టి బ్యాంక్ అధికారులను నిలదీశారు. గ్రామ సర్పంచ్ అత్తి నాగబాబు ఖాతాదారులకు మద్దతుగా నిలిచి బంగారు ఆభరణాలు కోల్పోయిన బాధితులకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

● పి.గన్నవరంలో ఏడుగురిపై దాడి

పి.గన్నవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. పి.గన్నవరం పెట్రోలు బంకు సమీపంలో వివిధ గ్రామాలకు చెందిన ఏడుగురిపై కొన్నిగంటల వ్యవధిలో దాడికి పాల్పడింది. గాయపడిన వారిలో జల్లి పుష్పవతి (వై.కొత్తపల్లి), యర్రంశెట్టి సత్యశ్రీరామ్ (పి.గన్నవరం), తోరం సత్యసాయి (వైపీ పాలెం), సీహెచ్ నాగరాజు (పి.గన్నవరం శివారు అంబేడ్కర్ కాలనీ), చుట్టుగుళ్ల శ్రీనివాస్ (పి.గన్నవరం), సీహెచ్ నరసింహం (పి.గన్నవరం)ఉన్నారు. వీరికి పి.గన్నవరం సీహెచ్‌సీలో ఏఆర్‌వీ వ్యాక్సిన్ అందించి ప్రథమ చికిత్స చేశారు. వారిలో ఇద్దరికి బలమైన గాయాలు కావడంతో కొన్ని గంటలపాటు పరిశీలనలో ఉంచినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. కాగా, పి.గన్నవరం, తదితర పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

సత్యదేవుడికి హెలీకాప్టర్ ఫ్యాన్లు అందజేత


వార్షిక కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన ఫ్యాన్లు

అన్నవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అన్నవరంలోని సత్యదేవుడి వార్షిక కల్యాణమండపం వద్ద భక్తులు సేద తీరేందుకు హెలీకాప్టర్ ఫ్యాన్లను శుక్రవారం అమర్చారు. వీటిని లలిత రైస్ ఇండస్ట్రీస్ అధినేతల్లో ఒకరైన మట్టే సత్యప్రసాద్ విరాళంగా సమకూర్చారు. వీటివిలువ సుమారు రూ. ఐదు లక్షలు ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు. అలాగే ప్రసాదం కౌంటర్‌లోని షెడ్డు వద్ద మరో ఫ్యాన్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

చెట్టుకు ఉరి వేసుకుని యువకుడి మృతి


చెట్టుకు వేళాడుతున్న సైదుఏసు మృతదేహం

తాళ్లపూడి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి పోలీస్‌స్టేషన్ పరిధి తిరుగుడుమెట్టలో శుక్రవారం ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తాళ్లపూడి పోలీసులు తెలిపిన వివరాలివి.. తిరుగుడుమెట్టకి చెందిన సైదుఏసు (26) గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకున్నట్టు సమాచారం అందింది. దీంతో పోలీసులు వెళ్లగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. ఈయనకు ఆరు సంవత్సరాల క్రితం వివాహ మయ్యింది. ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో కొద్దిరోజుల క్రితం భార్య మృతి చెందింది. దీంతో మానసికంగా బాధపడుతూ ఉండేవాడని ఆయన తల్లి పేర్కొంది. ఆమె ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టీ.రామకృష్ణ తెలిపారు.

ప్రతి మహిళ వ్యాపారవేత్తగా ఎదగాలి

● రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ



కాకినాడలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ శైలజ, తదితరులు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ వ్యాపారవేత్తగా, పారిశ్రామికవేత్తగా ఎదిగేలా రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, రక్షణలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ కోరారు. కాకినాడ జిల్లాలో శుక్రవారం ఆమె పర్యటించారు. కాకినాడ స్మార్ట్ సిటీ సమావేశ హాలులో ఐసీడీఎస్ విభాగం మహిళాల సంక్షేమం, భద్రత, హక్కులు అంశాలపై నిర్వహించిన జిల్లాస్థాయి అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మహిళా కమిషన్ చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల భద్రత, రక్షణ కేవలం ప్రభుత్వం, పోలీసులు ఒక్కరిదే బాధ్యత కాదని, సమాజంలో ప్రతిఒక్కరూ ఈ బాధ్యత స్వీకరించేందుకు ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వం ఎన్ని వనరులు కల్పించినా, పోలీస్ విభాగం ద్వారా శక్తి యాప్, శక్తి టీమ్స్, మహిళా పోలీస్‌స్టేషన్ వంటి ఎన్ని వ్యవస్థలు ఏర్పాటు చేసినా మహిళలపై అక్కడక్కడా లైగింక వేధింపులు, దాడులు ఇంకా జరుగుతూనే ఉన్నాయని అన్నారు. అవగాహనలోపం వల్లే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని, మహిళాశిశు సంక్షేమశాఖ ద్వారా ప్రతిచోటా, వేసవి సెలవుల్లో కూడా కిశోర వికాశం వంటి కార్యక్రమాల ద్వారా గుడ్ టచ్, బాడ్ టచ్, పోక్సో తదితర చట్టాల గురించి బాలికలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మహిళా కమిషన్ ద్వారా ఈ అవగాహన కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తృతంగా చేపడుతున్నామన్నారు. మహిళల రక్షణ దిశగా కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని, ఇటీవల వెలువడిన జాతీయస్థాయి సర్వేలో వైజాగ్ నగరం దేశంలో బాలికలకు అత్యంత భద్రమైన నగరాల్లో ఒకటిగా పేర్కొనడం మనందరం ఆనందించే అంశమని తెలిపారు. కేవలం వైజాగ్ నగరమే కాకుండా రాష్ట్రంలోని ప్రతి ఊరిని ఆడ పిల్లలకు భద్రమైనదిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మహిళా కమిషన్ పనిచేస్తోందని, ఇందుకు అందరి సహకారం అవసరమని తెలిపారు. ముఖ్యంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఎన్‌జీవో సంస్థలు మంచి విద్య, మార్కుల సాధనతో పాటు సమాజంలో భద్రంగా ఎలా ఉండాలనే అంశంపై ఆడపిల్లలకు అవగాహన కల్పించాలని, మగపిల్లలు సైతం బాలికలు, మహిళలపట్ల మర్యాదగా వ్యవహరించేలా నైతిక శిక్షణ ఇవ్వాలని కోరారు. ఆడబిడ్డలు, మహిళలపై అకృత్యాలు జరిగినప్పుడు, వాటిపై ధైర్యంగా ఫిర్యాదు చేసేందుకు బాధితులు ముందుకు రావాలని, రిపోర్టింగ్ పెరిగి నేరస్తులకు శిక్షలు పడితే, నేర ప్రవృత్తి కలిగిన వారికి వణుకు పుట్టించే గట్టి హెచ్చరికలుగా నిలుస్తాయని, లింగపరమైన నేరాలు తగ్గుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంవల్ల ఎక్కువమంది మహిళలు బయటికి వచ్చి ఆర్థికాభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని, తద్వారా మహిళా సాధికారత మరింత పెరిగి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో మహిళలు కీలక భూమిక వహిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న రక్షణ, ప్రోత్సాహాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ కోరారు.

ఉల్లాసంగా... ఉత్సాహంగా

● అమలాపురంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

●172 మంది క్రీడాకారులు హాజరు



పోటీల్లో పవర్ లిఫ్టింగ్ చేస్తున్న క్రీడాకారులు



అమలాపురం టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అమలాపురంలో శుక్రవారం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ఆద్యంతం ఉల్లాసంగా .. ఉత్కంఠ భరితంగా జరిగాయి. అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 172 మంది పవర్ లిఫ్టర్లు హాజరయ్యారు. పోటీలను టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు ప్రారంభించారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్త్రీ, పురుష విభాగాల్లో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీలను ఒలింపిక్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి, డీఎస్డీవో పీఎస్ సురేష్ కుమార్, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్ హాజరై పలు విభాగాల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అడపా వెంకటసుబ్రహ్మణ్యం, కల్వకొలను బాబు, రవణం వేణుగోపాల్, ముమ్మిడి ప్రతాప్‌కుమార్, కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠ పోరులో విజేతలు..

ఈ పోటీల విజేతలను కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు శుక్రవారం రాత్రి వెల్లడించారు. 53 కిలోల పురుషుల విభాగంలో పి.వీరేంద్ర (కాకినాడ) ప్రథమ, పి.సూర్యదినేష్ (పి.గన్నవరం) ద్వితీయ, సీహెచ్ సత్యగోపి (అమలాపురం) తృతీయ స్థానాలు సాధించారు. 59 కిలోల సీనియర్స్ విభాగంలో వై.రాజు (రాజమహేంద్రవరం) ప్రథమ, వై.వీరబాబు (పి.గన్నవరం) ద్వితీయ, వి.రవికుమార్ (మురమళ్ల) తృతీయ స్థానాలు సాధించారు. 66 కిలోల విభాగంలో జి.సాయిమణికంఠ (కాకినాడ), కె.నాని (అమలాపురం), జి.ఫణిమధు (రాజమహేంద్రవరం) వరుస స్థానాల్లో నిలిచారు. 66 కిలోల మహిళల విభాగంలో పి.స్పందన (రాజోలు) ప్రథమ, యు.షానిక (రాజోలు) ద్వితీయ, టి.కీర్తి (రాజోలు) తృతీయ స్థానాల్లో నిలిచారు. 66కిలోల పైబడిన విభాగంలో పి.దీవెన (కాకినాడ) ప్రథమ, వై.ఇందిర(అమలాపురం) ద్వితీయ, కె.మంజుల(రాజోలు) తృతీయ స్థానాల్లో నిలిచారు. రాత్రి వరకు పోటీలు కొనసాగుతున్నాయి.

బాలుర విభాగంలో ...

ఉధృతంగా గోదావరి

» కాటన్ బ్యారేజ్ నుంచి 7,52,579 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి విడుదల

» నిలకడగా నీటి మట్టం


ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద ఉధృతి

ధవళేశ్వరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఉపనదుల నుంచి వస్తున్న వరద నీటితో ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. కాటన్ బ్యారేజ్ మొత్తం గేట్లను పూర్తిగా ఎత్తి వేసి (ఆల్ క్లియర్ పొజిషన్)ఎగువ నుంచి వస్తున్న నీటిని వస్తున్నట్లే దిగువకు విడుదల చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ నుంచి 7,52,579 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుంది. ఈ సమయంలో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10 అడుగులుగా నమోదై నిలకడగా కొనసాగుతోంది. ఇదే సమయంలో ఎగువన భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దిశగా పెరుగుతున్న నీటి మట్టం శుక్రవారం రాత్రి 7గంటలకు 42.90 అడుగులకు చేరుంది. మరో పాయింట్ పెరిగి నీటి మట్టం 43 అడుగులకు చేరితే భద్రాచలం వద్ద మొదటిప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది.


నీట మునిగిన చింతూరు-వరరామచంద్రపురం ప్రధాన రహదారి

తగ్గుతూ..పెరుగుతూ..


చింతూరు-ఒడిస్సా హైవేపై వెళ్తున్న వాహనాలు

చింతూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వరద రోజుల తరబడి పెరుగుతూ, తగ్గుతూ దోబూచులాడుతోంది. చింతూరు వద్ద శబరి నది 32 అడుగులుగా ఉండగా సాయంత్రం 7 గంటలకు 30 అడుగులకు తగ్గింది. కాగా భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి పెరుగుతుండడంతో ఆ ప్రభావం శనివారం ఉదయానికి శబరి నదిపై పడనుంది. దీంతో తిరిగి శబరి పెరిగే పరిస్థితి కానవస్తోంది. గోదావరి ఎగపోటే దీనికి కారణంగా ఉంది. ఇదిలా ఉండగా చింతూరు మీదుగా ఒడిస్సాకు వెళ్లే జాతీయ రహదారిపై వరద నీరు తగ్గడంతో అటుగా రాకపోకలు మొదలయ్యాయి. అయితే సోకిలేరు వాగుపై వరద తగ్గకపోవడంతో చింతూరు- వరరామచంద్రపురం మండలాల నడుమ రాకపోకలు సాగే పరిస్థితి లేకుండా పోయింది. శనివారం శబరి నదికి వరద ఉధృతి పెరిగే పరిస్థితి ఉన్నందున లోతట్టు వాసులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొఖ్వాల్ సూచించారు. చింతూరు డివిజన్‌లో తొమ్మిది ప్రదేశాల్లో ప్రధాన రహదారులు ముంపునకు గురయ్యాయి. దీంతో అటుగా రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాల్లో ప్రజల అవసరాల మేరకు నాటు పడవలు, ట్రాక్టర్లను ఏర్పాటు చేసినట్టు పీవో పేర్కొన్నారు. రోజుల తరబడి వరద తగ్గకపోవడంతో లోతట్టు వాసులు నిత్యావసర వస్తువుల కోసం అవస్థలు పడుతున్నారు. కాగా వరద తగ్గడం, పెరుగుతుండడంతో ముంపు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నిండుకుండలా..



మోతుగూడెం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సీలేరు నది పరివాహక ప్రాంతంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలాశయాల నీటిమట్టాలు గణనీయంగా పెరుగుతున్నాయి. డొంకరాయి జలాశయం 1037 అడుగులు కాగా, శుక్రవారం సాయంత్రానికి 1031.0అడుగులకు చేరుకుంది. వర్షాలు ఇలాగే కురిస్తే త్వరలోనే గరిష్ట నీటి మట్టానికి చేరుకుంటుందని జెన్‌కో ఉన్నతాధికారులు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జలాశయాల నీటిమట్టాలు గణనీయంగా పెరుగుతుండడంతో మున్ముందు విద్యుదుత్పత్తికి ఎటువంటి ఆటంకాలు ఉండవని అధికారులు పేర్కొన్నారు.

స్కూల్ భవనంపై చర్చి నిర్వహణ సరికాదు

కోరుమిల్లిలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆందోళన


ఆందోళనకారులతో మాట్లాడుతున్న డీఎస్పీ రఘువీర్

కపిలేశ్వరపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి గ్రామంలో ప్రైవేటు పాఠశాల భవనంపై చర్చి నిర్వహిస్తున్నారంటూ హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించి పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ప్రైవేటు పాఠశాల వద్ద ప్రార్థనలు నిర్వహించడం సరికాదని కొంతకాలంగా అడుగుతున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు.రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్,ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, మండపేట రూరల్ సీఐ దొరరాజు ఆందోళనకారులతో చర్చలు జరిపారు. చర్చికి నిర్వహణకు అనుమతులు లేకపోయినా సర్పంచ్, కార్యదర్శి చర్యలు తీసుకోలేదని ఆందోళనకారులు అన్నారు. కాగా చర్చి నిర్వాహకులు వచ్చే నెల 6 నాటికి అనుమతి పత్రాలు సమర్పించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని కార్యదర్శి కామేశ్వరరావు నోటీసు జారీ చేశారు. కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీహెచ్ గవరయ్య, విజయ్, ఉమ్మడి జిల్లా హైందవ పరిరక్షణ మహిళా అధ్యక్షురాలు కె.తులసి, సర్పంచ్ ఆచంట సత్యనారాయణ పాల్గొన్నారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

కపిలేశ్వరపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదార్లంక పంచాయతీ శివారు వీధివారిలంకకు చెందిన పల్లి చిట్టియ్య(65) మృతదేహం శుక్రవారం లభ్యమైంది.గురువారం చిట్టియ్య తాతపూడి లంకకు వెళ్లి తిరిగి రాకపోవడంతో గోదావరిలో పడి గల్లంతై ఉండవచ్చని కుటుంబ సభ్యులు ఫిర్యాదుతో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందంతో రెవెన్యూ, పోలీసులు గాలించారు.దీం తో చిట్టియ్య మృతదేహాన్ని తొగరపాయ నదిలో గుర్తించి వెలికితీసారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించామని, ఈ మేరకు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపారు.

బంగారు గొలుసు.. బాధితుడికి అందజేత

అలమూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం పినపళ్ల గ్రామానికి చెందిన కుమ్మరపురుగు ఆదినారాయణ జొన్నాడ నుంచి ఆలమూరు వైపు వస్తుండగా పెట్రోల్ బంక్ సమీపంలో 2కాసుల బంగారు గొలుసు పడిపోయింది. దీనిపై ఆయ న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే అటుగా వస్తున్న ఆలమూరు ఏఎంసీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు, చింతలూరు సొసైటీ అధ్యక్షుడు నల్లా వెంకన్నలకు ఆ గొలుసు దొరకగా దానిని ఆలమూరు పోలీసులకు అందించారు.దీంతో ఆదినారాయణను పిలిపించి లక్ష్మణరావు, వెంకన్నల సమక్షంలో గొలుసును ఎస్ఐ జి.నరేష్, ఏఎస్ఐ సూర్యచంద్రరావు అందించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు, వెంకన్నలకు ఆదినారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

బాలబాలాజీ ఆదాయం రూ.38,20,531



మామిడికుదురు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ ఆలయ హుండీల ఆదాయం రూ.38,20,531 వచ్చిందని సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. 71 రోజులకు హుండీ లెక్కింపును శుక్రవారం నిర్వహించగా పై ఆదాయంతో పాటు 30.200 గ్రాముల బంగారం, 105.00 గ్రాముల వెండి, యూఎస్ డాలర్ నాలుగు, సౌదీ అరేబియా రియల్స్ 10, యూఏఈ దిర్హమ్స్ 5, ఒమన్ రియల్స్ 5, కువైట్ దినార్స్ 23, ఇరాక్ దినార్స్ 5 వచ్చినట్టు తెలిపారు. లెక్కింపులో అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన సహాయ కమిషనర్ ఎంకేటీవీ ప్రసాద్, బాలబాలాజీ ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ సమావేశాలకు ఐసీఏఆర్ డైరెక్టర్


శేషుమాధవ్‌ను అభినందిస్తున్న ఐసీఏఆర్, శాస్త్రవేత్తలు, సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్, 29(ఆంధ్రజ్యోతి): పొగాకు, పొగాకు ఉత్పత్తులకు సంబంధించి స్టాక్ హోం స్వీడన్‌లో సెప్టెంబరు 2 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ సమావేశాలకు రాజమహేంద్రవరం ఐసీఏఆర్ డైరెక్టర్ ఎం.శేషుమాధవ్ పాల్గొననున్నారు.భారతదేశం ఐఎస్‌వో-టీసీ-126లో సభ్య దేశంగా ఉన్నందున భారత ప్రతినిధిగా ఆయన ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ సమావేశాల్లో పొగాకు ఉత్పత్తుల పరీక్షలకు సంబంధించి అంతర్జాతీయ ప్రమాణాల సమీక్షలో పాల్గొని ప్రసంగించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శేషుమాధవ్‌కు ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

గేదెలను మేపడానికి వెళ్లి విగతజీవిగా మారాడు

సుద్దగడ్డ కాలువలో వ్యక్తి మృతదేహం

గొల్లప్రోలు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గేదెలు మేపడానికి వెళ్లి కనబడకుండా పోయిన వ్యక్తి విగతజీవిగా మారిన సంఘటన గొల్లప్రోలులో జరిగింది. పట్టణంలోని కరణంగారి వీధికి చెందిన దాట్ల నాగబాబు(48) ఎనిమిదేళ్లుగా వెల్లంకుల నాగశ్రీను వద్ద గేదెలు మేపుతూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 17న గేదెలు మేపేందుకు వెళ్లి తిరిగి రాలేదు. గేదెలు మాత్రం తిరిగి వచ్చాయి. దీనితో అతడి కోసం ఎక్కడా వెతికినా ఫలితం లేకపోయింది. శుక్రవారం ఉదయం పట్టణ శివారు తాటిపర్తి పుంతరోడ్డులోని సుద్దగడ్డ కాలువలో అతడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. కాలువలోని తుమ్మచెట్టుకు తగులుకుని మృతదేహం ఉండిపోయింది. ప్రమాదవశాత్తు పడి మరణించాడా, ఇతర కారణాలు ఉన్నాయా అనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడి భార్య 20 సంవత్సరాల క్రితమే అతడి నుంచి వేరుగా వెళ్లిపోయింది. అతడికి సంబంధీకులు ఎవరు లేరని పోలీసులు తెలిపారు.

కొట్లాట కేసులో నిందితుడికి ఏడాది జైలు

కె.గంగవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కొట్లాట కేసులో వ్యక్తిని గాయపరిచిన నిందితుడికి జైలు శిక్ష పడిందని పామర్రు ఎస్ఐ ఎస్‌కే జానీబాషా శుక్రవారం తెలిపారు. గత సంవత్సరం జూన్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కుడుపూరు గ్రామంలో పోలిశెట్టి వెంకటరమణ తన కుమారుడు మనోహర్‌తో తన ఎదురింటిలో ఉంటున్న కనకాల వీరబాబు వద్దకు వెళ్లి ఒక బండి విషయమై గొడవ పడ్డారు. వెంకటరమణను వీరబాబు దాడిచేసి గాయపరిచాడు. దీనిపై బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. రామచంద్రపురం కోర్టులో వాదోపవాదాల అనంతరం వీరబాబుకు ఏడాది జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్.శారద శుక్రవారం తీర్పునిచ్చారు. ఏపీపీ రామతులసి వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తులో కృషి చేసిన ఎస్ఐ జానీ బాషా, సిబ్బంది బృందాన్ని డీఎస్పీ బి.రఘువీర్, సీఐ వెంకటనారాయణ అభినందించారు.

సిద్ధివినాయక సన్నిధిలో ఎస్పీ పూజలు

అయినవిల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి వినాయకస్వామిని శుక్రవారం ఎస్పీ బి.కృష్ణారావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఎస్పీకి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ప్రధానార్చకులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

నందమూరి హరికృష్ణ వర్ధంతి

ముమ్మిడివరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి నందమూరి హరికృష్ణ వర్ధంతిని ముమ్మిడివరంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో హరికృష్ణ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. తాడి నరసింహారావు, దాట్ల బాబు, పిల్లి నాగరాజు, సత్తి నూకరాజు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



జాతీయస్థాయి క్రీడాకారుడు వీరేంద్రను సత్కరిస్తున్న పద్మనాభం తదితరులు

అమలాపురం రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి కె.పద్మనాభం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ శారీరకంగా, మానసికంగా ధృడంగా ఎదగాలన్నారు. కళాశాల చైర్మన్ బోనం కృష్ణసతీష్, బీవీసీ అక్షర్ ఇంటర్నేషనల్ స్కూలు మేనేజింగ్ డైరెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ కళాశాల నుంచి జాతీయస్థాయి క్రీడాకారులను అందిస్తున్న విధానాన్ని వివరించారు. తొలుత ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టింగ్, వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చాటుతున్న ఎంబీఏ విద్యార్థి మారే వీరేంద్రను బెస్ట్ స్పోర్ట్స్‌మెన్ అవార్డుతో సత్కరించారు. స్టేట్ ప్యానల్ ఎంపైర్‌లైన విక్రమ్, జె.సురేష్‌లతో పాటు ముఖ్య అతిథి పద్మనాభంను సత్కరించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు కరాటం రవిసుధీర్, ఎం.పార్వతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు, వైస్ ప్రిన్సిపాల్ ఎంసీఎస్ మధన్, పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు, డాక్టర్ గోకరకొండ నాగేంద్ర, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాల, రావుబహదూర్ రఘుపతి వెంకటరత్నంనాయుడు మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. పాల్గొన్న వక్తలు క్రీడల విశిష్టత, ప్రయోజనాలను వివరించారు. మినిస్ట్రీ ఆఫ్ యూత్‌ఎఫైర్స్, స్పోర్ట్స్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కాశిన ఫణీంద్ర, ప్రిన్సిపాల్ గంధం శ్రీరామమూర్తి, గణేశుల బ్రహ్మానందం, జగతా సురేష్, గుర్రం మహేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజోలు,(ఆంధ్రజ్యోతి): రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ వర్మ పాల్గొన్నారు. ఈసందర్భంగా వర్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి పెద్దపీటవేసి, నేటి యువతకు క్రీడల ద్వారా ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించారన్నారు. అనంతరం వర్మను ప్రిన్సిపాల్ సాయిబాబు, శ్రీకాంత్, సత్యనారాయణ, స్పోర్ట్స్ ఇన్‌చార్జి రాజు, మధుకుమార్ దుశ్శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

యానాం, (ఆంధ్రజ్యోతి): స్థానిక జీఎంజీ బాలయోగి క్రీడా మైదానంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యానాం వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో శాయ్ సెంటార్ ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, పరిపాలనాధికారి మునిస్వామి, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్, యానాం సీఐ అడలరసన్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ పోటీల్లో ప్రతిభ సాధించిన క్రీడాకారులకు అతిథులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో శాయ్ సెంటార్ ప్రతినిధులు ఉదయ్, రాజేష్ పాల్గొన్నారు.

యానాం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పుదుచ్చేరి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నేతృత్వంలో ర్యాలీ నిర్వహించారు. యానాం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐ, నెహ్రూయువకేంద్ర సంయుక్త నిర్వహణలో ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణాసుధాకర్, జిల్లా యువజన అధికారి తిర్రిగోపీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రం అధికారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

'జిల్లా వ్యాప్తంగా 725 గోకులం షెడ్లు'



మానేపల్లి పశువైద్యశాలలో మందులను పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యశాఖాధికారి డాక్టర్ వెంకట్రావు

పి.గన్నవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 725గోకులం షెడ్లకు అనుమతులు ఇచ్చామని, నిర్మాణాలు జరుగుతున్నాయని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కె.వెంకట్రావు తెలిపారు. మానేపల్లి పశువైద్యశాలను సందర్శించిన ఆయన అనంతరం మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 1075గోకులం షెడ్ల నిర్మాణమే లక్ష్యం కాగా ఇప్పటివరకు 725గోకులం షెడ్లు మంజూరు చేశామన్నారు. ప్రస్తుతం 200గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. గతంలో నిర్మాణం పూర్తయిన గోకులం షెడ్లకు విత్ హెల్డ్ సొమ్ము లబ్ధిదారులకు అందుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం పూర్తయిన వాటికి కూడా త్వరలో బిల్లులు అందించే అవకాశం ఉందన్నారు. పశుగ్రాసం కొరత కారణంగా పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వారి ఇబ్బందులు దృష్ట్యా పశుదాణాను రాయితీతో అందించే యోచనలో కలెక్టర్ ఉన్నారన్నారు. ప్రస్తుతం పశుదాణా అవసరమైన పాడిరైతులు రూ.1200 (50 కిలోలు)తో ఆర్డర్ చేసుకుంటే సచివాలయాలు ద్వారా అందించే అవకాశం ఉందన్నారు. అనంతరం ఆసుపత్రిలో ఉన్న మందులను, రిజిష్టర్లు, పరిసరాలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అలాగే గోకులం షెడ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా సకాలంలో పశువులకు వ్యాక్సిన్లు అందించాలని, గొర్రెల నట్టల నివారణకు అందుబాటులో ఉన్న వ్యాక్సిన్లు, మందులపై అవగాహన కల్పించాలని తదితర అంశాలపై స్థానిక వైద్యులకు, సిబ్బందికి ఆయన సూచించారు. ఆయన వెంట మండల పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్‌చైతన్య, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలి

పి.గన్నవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు అనుసరించి ప్రతి విద్యార్థికి మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ సూచించారు. నరేంద్రపురం గురుకుల పాఠశాలలో తహశీల్దార్ పి.శ్రీపల్లవితో కలిసి శుక్రవారం తనిఖీలు నిర్వహించి అనంతరం మాట్లాడారు. ప్రభుత్వం గురుకుల పాఠశాలలకు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. అనంతరం విద్యార్థుల భోజనశాల, బాత్‌రూమ్స్, తరగతి గదులను, క్రీడాస్థలాన్ని ఆయన పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. క్రీడా స్థలం అభివృద్ధికి, ఫ్యాన్లు, లైట్ల ఏర్పాటుకు, ప్రహరీ ఎత్తు చేయడం పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆర్డీవో ఆదేశించారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో రాజీపడితే చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హెచ్చరించారు. పాఠశాలపై నిత్యం పర్యవేక్షణ ఉంటుందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఆర్ఐ డాంగే, వీఆర్వోలు రమేష్, సత్య, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగుభాషా సంబరాలు

- తెలుగు భాషా దినోత్సవం
- గిడుగు చిత్ర పటానికి నివాళి







అమలాపురం భాష్యం పాఠశాలలో విద్యార్థునుల ప్రదర్శన, ముమ్మిడివరం: గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం, మామిడికుదురు హైస్కూలులో గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

అమలాపురం టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని అమలాపురం భాష్యం పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భాష్యం జోనల్ ఇన్‌చార్జి జవ్వాది వెంకటశ్రీనివాస్ తొలుత గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. తెలుగుదనం ఉట్టిపడేలా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. తెలుగుతల్లి వేషధారణలతో చిన్నారులు అలరించారు. తెలుగుభాషలో అత్యున్నతమైన గ్రంథాలు, రచనలతో ప్రదర్శన నిర్వహించారు. తెలుగులోని కాలపత్ర గ్రంథాల నుంచి తెలుగువారి పిండి వంటలను ప్రదర్శనలో ఉంచారు. విద్యార్థులకు తెలుగుభాషపై పద్యాలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల విజేతలకు వెంకటశ్రీనివాస్ బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో స్కూలు ప్రిన్సిపాల్ సీహెచ్ రవి, చాంప్స్ ఇన్‌చార్జి కె.నాగశ్రీ, జె.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. అమలాపురం విద్యార్థిని విద్యా సంస్థల ప్రాంగణంలో చైర్మన్ ఏబీ నాయుడు ఆధ్వర్యంలో తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎ.శ్యామలామహలక్ష్మి, ప్రిన్సిపాల్ టి.నాగమాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అమలాపురం శ్రీవెంకటేశ్వరా డిగ్రీ కళాశాలలో గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి కరస్పాండెంట్ కేవీఆర్‌ఎన్ నరసింహారావు పూలమాలలువేసి నివాళులర్పించారు. తెలుగుభాషలో కవితా పోటీలు నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రముఖకవి సీలి సంసోన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేఎస్వీఎన్ మనోహర్, కరాటం ప్రవీణ్, యాలంగి వరప్రసాద్, చోడే జాన్‌పాల్, కె.శ్రావణ్‌దిలీప్, డాక్టర్ కె.హేమవిజిత తదితరులు పాల్గొన్నారు. అమ్మ భాషకు గిడుగు గొడుగు వంటి వారని వాకర్స్ జిల్లా గవర్నర్ సప్పా నాగేశ్వరరావు కొనియాడారు. అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్‌క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక తారకరామానగర్‌లో నిర్వహించిన తెలుగు భాషా వేడుకలకు నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగాహాజరై గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యదర్శి గోటేటి లక్ష్మి, మాజీ అధ్యక్షులు దువ్వూరి సుబ్బలక్ష్మి, పుత్సా రాజేశ్వరి, శిష్టాలక్ష్మిదేవి, పేరి లలిత, గోటేటి గంగాధరరావు, పుత్సా కృష్ణకామేశ్వర్ పాల్గొన్నారు.

దేశభాషలందు తెలుగు లెస్స

అమలాపురం రూరల్, (ఆంధ్రజ్యోతి): తెలుగుభాష గొప్పదనాన్ని శ్రీకృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యద గ్రంథంలో దేశ భాషలందు తెలుగు లెస్స అని కీర్తించారు. ఆ మహనీయునితో పాటు కవిత్రయంగా పేరొందిన ఆదికవి నన్నయ, తిక్కన, ఎర్రాప్రగడ, శ్రీనాథుడు, దాశరథీ, కందుకూరి వీరేశలింగం పంతులు, సుమతీశతకకర్త బద్దెన, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి నుంచి నేటితరం ఆధునిక తెలుగు దిగ్గజకవుల చిత్రపటాలతో వారి జీవిత చరిత్రను వివరిస్తూ అమలాపురం మండలం వన్నెచింతలపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుబ్బల నాగసత్యనారాయణ ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. తెలుగుభాష ఉపాధ్యాయుడు బడుగు సత్యానారాయణ, మామిడిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కవిత్రయం వేషధారణలతో పాటు తెలుగు తల్లి వేషధారణలతో ప్రదర్శనలు నిర్వహించారు. తెలుగుభాష గొప్పదనాన్ని హెచ్ఎం నాగసత్యనారాయణ వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. తెలుగు ఉపాధ్యాయులతో పాటు జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాయామ ఉపాధ్యాయుడు విఘ్నేశ్వరుడుని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ముత్యాల బాబు, ఉపాధ్యాయులు, తెలుగు భాషాభిమానులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): గిడుగు వెంకటరామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ముమ్మిడివరంలో తెలుగుభాషా వేడుకలు ఘనంగా నిర్వహించారు. తారా విద్యాసంస్థల ప్రాంగణంలో పొత్తూరి లక్ష్మీశ్రీనివాస్ అధ్యక్షతన కళాసాహితీ, లలితకళల సేవావేదిక ఆధ్వర్యంలో తెలుగుభాషా వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. వక్తలు తెలుగుభాష ఔన్నత్యం, ప్రాధాన్యతను వివరించి తెలుగుభాషా పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులకు తెలుగుభాషా మాధుర్యం, నైతిక విలువలు అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎలిపే మధు, జనిపల్లి సత్యనారాయణ, జేవీఎల్ నరసింహారావు, ప్రిన్సిపాల్ సత్తిబాబు, విద్యాసంస్థల అధిపతి సుమంత్, ఎన్.అబ్బులు, విత్తనాల వరప్రసాదరావు, పి.విజయ్‌కుమార్, ఎన్.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ముమ్మిడివరం ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో తెలుగుభాషా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలుగు అధ్యాపకురాలు ఎన్.స్వర్ణకుమారి తెలుగుభాష ఔన్నత్యాన్ని, గొప్పదనాన్ని వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టిబాబు మాట్లాడుతూ తెలుగుభాషను పరిరక్షించేందుకు భావితరాలు కృషి చేయాలన్నారు. ఈసందర్భంగా తెలుగు అధ్యాపకురాలు ఎన్.స్వర్ణకుమారిని దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.తులసీలక్ష్మి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. అలాగే శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాల, రావుబహదూర్ రఘుపతి వెంకటరత్నంనాయుడు మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. తెలుగు అధ్యాపకుడు పచ్చిమాల శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ గంధం శ్రీరామమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గణేశుల బ్రహ్మానందం, జగతా సురేష్, గుర్రం మహేష్, వనిమశెట్టి రావు, కె.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): అంబాజీపేట, తొండవరం, గంగలకుర్రు అగ్రహారం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో తెలుగు భాషలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలన, బోధన, పాఠక రంగాల్లో తెలుగును కచ్చితంగా అమలు చేయాలని శ్రీశ్రీకళావేదిక జాతీయ సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. శ్రీశ్రీకళావేదిక ఆధ్వర్యంలో అల్లవరం శ్రీరవితేజ కళాశాలలో తెలుగుభాషా వేడుకలు, కవి సమ్మేళనాలు ఘనంగా జరిగాయి. ముందుగా తెలుగు పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు, శ్రీశ్రీ చిత్రపటాలకు ప్రతాప్ జ్యోతి ప్రజ్వలనచేసి తెలుగుభాషా దినోత్సవ వేడుకలు ప్రారంభించారు. మాకే బాలార్జున సత్యనారాయణ, బీవీవీ సత్యనారాయణ, నల్లా నరసింహమూర్తి, అరిగెల బలరామమూర్తి తదితరులు తెలుగుభాష ఔన్నత్యంపై ప్రసంగించారు. విద్యార్థులు, కవులు, తెలుగు భాష విశిష్టతలను తమ కవితల్లో చాటిచెప్పారు. ప్రముఖ కవి నల్లా నరసింహమూర్తి రచించిన నడక విజేత కవితాసంపుటిని డాక్టర్ ప్రతాప్ ఆవిష్కరించారు. గిడుగు రామమూర్తి పంతులు, గురజాడ అప్పారావు, మొల్లల వేషధారణలతో కడలి రామకృష్ణారావు, కడలి సత్యనారాయణ, దొడ్డి సత్యవేణి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కవులను, కవితలు చదివిన విద్యార్థులను సత్కరించారు. బి.శుభశ్రీ, నేలపూడి నాగభూషణం, పల్లేటి సుశీల, పేరి లక్ష్మీనరసింహం, నాగారపు సత్యనారాయణ పాల్గొన్నారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): అమ్మతనాన్ని తెలిపే తెలుగుభాషను పరిరక్షించుకోవడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మలికిపురం డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ మంగెన వెంకటసత్యనారాయణమూర్తి అన్నారు. గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా తెలుగుభాషా దినోత్సవాన్ని తెలుగు సాహిత్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధి దృష్ట్యా పర భాషలు నేర్చుకోవాలి గానీ మన తెలుగుభాషను దూరం చేసుకోరాదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆనందమహానీ, చిట్టాల సత్యనారాయణ, రామకృష్ణంరాజు, పీడీకే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వివేకానందలో తెలుగు భాషా దినోత్సవాన్ని జరిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులతో తెలుగు తల్లి, తెలుగు పండితుల వేషధారణలు వేయించారు. మేడిచర్లపాలెం హైస్కూలులో తెలుగు భాషా దినోత్సవంలో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆరేటి త్రిమూర్తులు, కంకటాల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అధ్యక్షతన శుక్రవారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాల తెలుగు అధ్యాపకురాలు షేక్ జరీనా బేగం పాల్గొన్నారు. తెలుగు భాషావేత్త శ్రీగిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా జరీనాబేగం మాట్లాడుతూ తెలుగుభాష అభివృద్ధికి రామమూర్తి పంతులు చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో శైలజ, లావణ్య, అశ్వినీరెడ్డి, రాజు, నారాయణ, చంద్రబోస్ పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా దినోత్సవాన్ని మామిడికుదురు హైస్కూలు, దీప్తి స్కూలులో శుక్రవారం నిర్వహించారు. మామిడికుదురు హైస్కూలులో పద్యాలు, వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రవాసాంధ్రుడు నయినాల శ్రీనివాసరావు సమకూర్చిన బహుమతులను అందజేశారు. తెలుగుభాష ఔన్నత్యానికి పాటుపడిన గిడుగు రామమూర్తి తదితర చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. దీప్తి స్కూలులో ఉపాధ్యాయులను సన్మానించారు. హెచ్ఎం బి.చిరంజీవిరావు, దీప్తి స్కూలు కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ జడ్పీ హైస్కూల్లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం జరుపుకున్నారు. గిడుగు వెంకటరామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్రీడల్లో పోటీలు నిర్వహించారు. హెచ్ఎం నూకల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో పీఎంసీ చైర్మన్ గుర్లింక చిన్నా, సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, స్టాఫ్ సెక్రటరీ నడింపల్లి పద్మనాభన్, కుడుపూడి భాగ్యలక్ష్మి, అనూరాధ, జయలక్ష్మి, పీడీలు కామన మధు, కరాటం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో ఉన్న అన్ని పాఠశాలల్లో తెలుగుభాషా వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంతర్వేది జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తెలుగుతల్లి వేషధారణతో అలంరించారు. క్రీడా దినోత్సవం, తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయురాలు నార్ని చాయాప్రసూనాంబ, తెలుగు భాషా ఉపాధ్యాయుడు ఎస్కే మహిబుల్లాషరీఫ్, పీడీ కె.భాస్కరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మేజర్ ధ్యాన్‌చంద్, గిడుగు రామమూర్తి పంతులు సేవలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

పి.గన్నవరం,(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం జడ్పీ హైస్కూల్లో తెలుగుభాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు పీవీవీ శ్రీలక్ష్మీ దేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలుగు భాషా గొప్పదనం, క్రీడా దినోత్సవ విశిష్టతను తెలుగు, వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.







మలికిపురం: విద్యార్థునుల సాంస్కృతిక కార్యక్రమాలు, అంతర్వేది జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగుతల్లి వేషధారణలో విద్యార్థులు, అమలాపురం: కవిత్రయంతో తెలుగుభాషా దినోత్సవం

ఘనంగా 'బీవీసీ'లో పరిచయ్ కార్యక్రమం

అమలాపురంరూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని బీవీసీ అక్షర్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ శుక్రవారం పరిచయ్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహించినట్టు చైర్మన్ బోనం కనకయ్య తెలిపారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కరస్పాండెంట్ బోనం కృష్ణసతీష్ పేర్కొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బోనం విజయలక్ష్మి, బండిగుప్తాపు పాండురంగ, డీన్ అడబాల దుర్గారావు, భీమన జానకీరామ్, కటకం రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

రూ.39వేలు పలికిన బాలగణపతి లడ్డూ



మామిడికుదురు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నగరంగ్రామం మల్లాయిపాలెం శ్రీబాలగణపతి స్వామివారి మండపం వద్ద ఉంచిన లడ్డూకు వేలం పాట నిర్వహించారు. ఐదున్నర కిలోల లడ్డూను భక్తురాలు మౌనిక ఆర్కే రూ.39,116కు పాడుకున్నారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. పితాని పండు, గుబ్బల రవి, రఘు, పితాని ప్రసాద్, యేడిద శేషారావు, పితాని సత్తిబాబు, దుర్గారావు, రాయుడు టోని పాల్గొన్నారు.

గణనాథులకు ఘనంగా అభిషేకాలు, పూజలు

అల్లవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గణపతినవరాత్రుల సందర్భంగా విద్యుద్దీపాలతో అలంకరించిన పందిళ్ల, వినాయకుని ఆలయాల్లో గణనాథులకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మొగళ్లమూరి, బెండమూర్లంక, కొమరగిరిపట్నం, ఓడలరేవు, అల్లవరం, బోడసకుర్రు, తూర్పులంక, గోడితిప్ప, గుడ్డివానిచింత, డి.రావులపాలెం, దేవగుప్తం తదితర గ్రామాల్లో గణపతి పందిళ్లలో గణనాథులకు కుంకుమ పూజలు, భజనలు జరిగాయి. మొగళ్లమూరి గణపతి ఆలయం వద్ద వాసర్ల వెంకట నర్సయ్య కుటుంబీకుల ఆధ్వర్యంలో జరిగిన అన్నసమారాధనకు భక్తులు పోటెత్తారు.

ఆదర్శ రైతులకు సత్కారం

ఐ.పోలవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పాతయింజరంలో శుక్రవారం రాచకొండ మాణిక్యాలరావు పొలంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో బలరామ జయంతిని నిర్వహించారు. ఇద్దరు ఆదర్శ రైతులను సత్కరించారు. బీకేఎస్ మండల కన్వీనర్ రాయపురెడ్డి స్వామినాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రైతు కలిదిండి సూరిబాబురాజు జెండా ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, బీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడబాల రాజామోహన్, వేగేశ్న సూర్యనారాయణరాజు, సాగిరాజు బాపిరాజు, పడాల నాగబాబు, ఇండుగుల దొరబాబు, పొత్తూరి వెంకటరాజు, ఉద్దీశ సత్తియ్య, ఉండ్రు నరసన్న, నంబు సత్తిబాబు, రాయపురెడ్డి సూరిబాబు, చిక్కాల శ్రీనివాస్, బొండా వెంకటేశ్వరరావు, కోళ్ళ భద్రం పాల్గొన్నారు.

ఘనంగా బలరామ్ జయంతి

అంబాజీపేట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): బలరామ జయంతిని మాచవరం పోతాయిలంక బీకేఎస్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బలరామ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి సూర్యనారాయణరాజు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, రైతులు ముత్యాల జమీలు, అడ్డాల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన

అంబాజీపేట, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): పసుపల్లిలో సర్పంచ్ మట్టపర్తి నాగరాజు అధ్యక్షతన జిల్లా వనరుల కేంద్రసహాయ వ్యవసాయ సంచాలకులు ఏవీఎస్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ఖరీఫ్ పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అవసరం మేరకు ఎరువులు, పురుగు మందులు వినియోగించాలన్నారు. ఏవో ధర్మప్రసాద్, డీఆర్సీ ఎవో మనోహర్, ఎఈవోలు జి.శివమోహన్, జాబేజ్ రైతులు పాల్గొన్నారు.

తాటిపాకలో 'పొలంబడి'

రాజోలు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తాటిపాకలో గుబ్బల దుర్గాప్రసాద్ స్థలంలో కల్పతరువు కోకో నీట్ రైతు సంఘం ద్వారా పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రాజోలు మండల వ్యవసాయాశాఖ అధికారి వై.మధుకుమార్ విత్తశుద్ధి, విత్తనం ఎంపిక తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు గుడాల నాగరాజు, దేవళ్ల మాణిక్యాలరావు, కడలి నరసింహారావు, గ్రామ వ్యవసాయశాఖాధికారి అబ్బాస్ పాల్గొన్నారు.

తాతారావుకు భీమ్‌రత్న అవార్డు ప్రదానం



తాతారావుకు భీమ్‌రత్న అవార్డు అందించి సత్కరిస్తున్న దళిత చైతన్యవేదిక సభ్యులు

మామిడికుదురు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ వాది, అంబేడ్కర్ సమకాలికుడు నగరం గ్రామానికి చెందిన జాలెం తాతారావుకు దళిత చైతన్య వేదిక వారు భీమ్‌రత్న అవార్డుతో సత్కరించారు. నగరం గ్రామంలో మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తాతారావును దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌తో కలిసి తాతారావు సాగించిన ప్రస్థానాన్ని వివరించారు. ఆనాడు అంబేడ్కర్‌తో కలవడం, ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్న తాతారావుకు భీమ్‌రత్న అవార్డు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జాలెం రమణకుమారి, దళిత చైతన్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, ఎంపీటీసీ సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, చిలకపాటి శ్రీధర్, జాలెం సుబ్బారావు, లిఖితపూడి బుజ్జి, ముఖర్రం హుస్సేన్, కలిగితి పల్లంరాజు, కోళ్ల సురేష్, జాలెం ఉమాభారతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలి

ముమ్మిడివరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ప్రజలు జ్వరాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వి.ఉదయభాస్కరవర్మ కోరారు. తరచూ భారీ వర్షాలు కురవడంతో లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలు ఉండి దోమలు పెరిగిపోయాయని, దీనివల్ల ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారని, డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలు ప్రబలకుండా వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ప్రజలకు మందులు పంపిణీ చేయాలని కోరారు. రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వర్మ డిమాండ్ చేశారు.

కొనసాగుతోన్న మున్సిపల్ ఉద్యోగుల ఆందోళన

యానాం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ యానాం మున్సిపల్ ఉద్యోగులు చేస్తున్న ఆందోళన శుక్రవారం కొనసాగింది. స్థానిక పరిపాలనాధికారి కార్యాలయం ఎదుట చేపట్టిన ఆందోళనలో ఉద్యోగులు మాట్లాడారు. వేతనాలు లేక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తక్షణమే స్పందించి ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని వారు కోరారు. అలాగే విశ్రాంతి ఉద్యోగులకు బకాయి వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సిబ్బంది ఆందోళన చేపట్టారు. మున్సిపల్ ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యో గులు, నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ యానాం అధ్యక్షుడు ఆర్థాని దినేష్, కాటంశెట్టి రామ్మూర్తి ఆందోళన చేస్తున్న ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు.

ఆర్ఏ మునిస్వామి సేవలు ప్రశంసనీయం

యానాం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పరిపాలనాధికారి మునిస్వామి సేవలు అభినందనీయమని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో జరిగిన కార్యక్రమంలో మల్లాడి మాట్లాడారు. బదిలీపై వెళ్తున్న మునిస్వామిని సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం స్థానిక నాయకులు మల్లాడి శామ్యూల్, పెండెం సూర్యప్రకాష్, గిడ్ల చంద్రరావు, గుత్తుల గోవింద జయరామారావు, కుడిపూడి శివన్నారాయణ, మల్లాడి అభిమాన సంఘ సభ్యులు మునిస్వామిని ఘనంగా సత్కరించారు.

వాలీబాల్ విన్నర్స్ 'గొల్లవిల్లి హైస్కూల్'

ఉప్పలగుప్తం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం బాలుర, బాలికల విభాగంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమలాపురం కిమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో జరిగిన పోటీల్లో గొల్లవిల్లి, భీమనపల్లి, మునిపల్లిహైస్కూల్ జట్లు పాల్గొన్నాయి. రెండు విభాగాల్లోనూ గొల్లవిల్లి జట్లు విన్నర్స్‌గా నిలిచాయి. విన్నర్స్‌తో పాటు క్రీడాకారులందరికి బహుమతులందించారు. హెచ్ఎం గోకరకొండ కనకదుర్గ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కిమ్స్ చైర్మన్ మోహన్‌రాజు, మేనేజర్ సురేష్, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అల్లాడ శరత్‌బాబు, కల్వకొలను బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి, పీఎంసీ చైర్మన్ వేలా సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, వాలీబాల్ క్రీడానిర్వాహకుడు వుండ్రు రాజబాబు, పీడీలు గొలకోటి ఫణీంద్ర కుమార్, కామన మధు, సీతాపతి, సరస్వతి, విజయభాస్కర్ పాల్గొన్నారు.


ద్వారపూడిలో గిడుగు రామ్మూర్తిపంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

అమ్మభాషను అక్కున చేర్చుకుందాం

● ఘనంగా తెలుగు భాషా దినోత్సవం


ఆలమూరు జెడ్పీ గరల్స్ హైస్కూల్‌లో తెలుగుభాషా దినోత్సవంలో గెలుపొందిన బహుమతులతో విద్యార్థినిలు

కొత్తపేట, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): అమ్మ భాషను మాధుర్యాన్ని అక్కున చేర్చుకుందామని వీకేవీ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు పేర్కొన్నారు. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక భాష్యం స్కూల్‌లో విద్యార్థులు తెలుగు తల్లిగాను, గిడుగు రామమూర్తి పంతులు వేషధారణలో అందర్నీ ఆకట్టుకున్నారు. అధ్యాపకులు, భాష్యం జోనల్ ప్రిన్సిపాల్ జె.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ వై.మణికంఠ, రమాజ్యోతి పాల్గొన్నారు.

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): తెలుగుబాష దినోత్సవం సందర్భంగా ఆలమూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆలమూరు జెడ్పీ గరల్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సభలో పలువురు వక్తలు ప్రసంగించారు. ప్రముఖకవి గౌరీ మల్లిక్ మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తిపంతులు తెలుగు అభివృద్ధికి ఆయన చేసిన సేవలు అభినందనీయమన్నారు. గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాయవరం(ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 గ్రామాల్లో తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సోమేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఆర్.దయామణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గిడుగు రామమూర్తి, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో క్రీడల్లో ప్రతిభ కబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాలలో క్రీడల అభివృద్ధికి రూ.25వేలు అందజేసిన పూర్వవిద్యార్థి, దాత తాడి రామచంద్రారెడ్డిని ఉపాధ్యాయులు సత్కరించారు.

ద్రాక్షారామ(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలుగుభాషా దినోత్సవం, క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయుడు మాట్లాడుతూ తెలుగుభాషా వికాసమే నిజమైన మనోవికాసం అన్నారు. హాకీ లెజెండ్ ద్యానచంద్ జన్మదినం పురస్కరించుకుని క్రీడా దినోత్సవం నిర్వహించారు. తెలుగుభాష వక్తృత్వ పోటీలు, క్రీడా పో టీ లో విజయం సాధించిన విద్యార్థులకు పతకాలు అందచేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ రామచంద్రపురం డివిజన్ నాయకుడు ఆని శ్రీనివాస్, ఇన్‌చార్జి హెచ్‌ఎం కె.వి సత్యనారాయణమూర్తి, తెలుగుఉపాధ్యాయులు పి.సునీత, జనార్ధనస్వామి, ఉపాసన, గాయత్రి, పీఈటీ ఉమ, అరవ విస్సు తదితరులు పాల్గొన్నారు.


దంగేరు పాఠశాలలో ఆ ఆకారంలో విద్యార్థులు

రామచంద్రపురంలో: రామచంద్రపురం పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా. సి.హెచ్.రామకృష్ణ, అధ్యాపకులు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలల వేసి నివాళి అర్పించారు. తెలుగుయువత అధ్యాపకులుడా. ఎం.సుజాత, డా. కె.శ్రీదేవి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కె.గంగవరం: తెలుగుబాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని దంగేరు పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గిడుగు రామమూర్తి జీవిత విశేషాలు తెలియజేశారు. 60 మంది విద్యార్థులతో అ, ఆ అకారంలో మానవహారం నిర్వహించారు.

విద్యార్థులు క్రీడల పట్ల ఆశక్తి చూపాలి

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వారు ఎంచుకున్న క్రీడల్లో ప్రతిభ కనబరిచి దేశ ఖ్యాతిని ఇనుమడింప చేయాలని విశ్రాంత ఆర్మీ అధికారి దాట్ల నాగశ్రీరామరాజు అన్నా రు. రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన ఫిజికల్ డైరెక్టర్ ఎస్.యువరాజు ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగశ్రీరామరాజు మాట్లాడుతూ విద్యార్థులు యోగా, మెడిటేషన్ చేయడంతోపాటు వివిధ రకాల క్రీడల్లో పాల్గొని దేశఖ్యాతిని ప్రపంచ దేశంలో ఇనుమడింప చేయాలన్నారు. అనంతరం స్థానిక కళాశాల ప్రాంగణంలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు.

మండపేట(ఆంధ్రజ్యోతి): తెలుగుకు వెలుగు గిడుగు రామ్మూర్తి పంతులు అని ఆయన తెలుగుభాష కోసం చేసిన కృషి మరువలేనిదని పలువురు వక్తలు అన్నారు. మండపేట మండలం ద్వారపూడి బాలికల జిల్లాపరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ హాకీ క్రీడాకారుడు ధ్యానచంద్ చిత్రపటానికి కూడా పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కె.టీ.టీ.వి.శ్రీనివాసరావు నేతృత్వంలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని జరుపుకున్నారు.

జగనన్నకాలనీల్లో గృహనిర్మాణం అవినీతిపై
విచారణ జరిపించాలి

● రామచంద్రపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల డిమాండ్



మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లను సత్కరిస్తున్న అఖిలపక్ష జేఏసీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం పట్టణ పేదలకు గృహనిర్మాణంలో భాగంగా జగనన్నకాలనీల్లో గృహ నిర్మాణంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని వైసీపీ విప్ వాడ్రేవు సాయిప్రసాద్, జనసేన కౌన్సిలర్ అంకం శ్రీనివాస్ కోరారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కౌన్సిలర్లు అంకం శ్రీనివాస్, వాడ్రేవు సాయిప్రసాద్‌లు మాట్లాడుతూ రామచంద్రపురం పట్టణంలో పేదలకు గృహనిర్మాణం నిమిత్తం వెల్లసావరం, ఆదివారపుపేటల్లో లేవుట్లు ఏర్పాటు చేశారన్నారు.గృహనిర్మాణం నిమిత్తం ప్రభుత్వ గ్రాంటుతోపాటు లబ్ధిదారులు తమవాటాగా కాంట్రాక్టర్లకు ఇంటికి రూ.5లక్షలు వరకు చెల్లించే విధంగా ఒప్పందాలు జరిగాయన్నారు. కాంట్రాక్టర్లు లబ్ధిదారుల నుంచి సొమ్ములు తీసుకుని గృహనిర్మాణాలు పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేశార్నారు. దీంతో పేదలు ఇళ్ల నిర్మాణం పూర్తికాక అద్దెఇళ్లలోనే జీవిస్తున్నారని అన్నారు. లబ్ధిదారులు, కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటుచేయాలని, అవినీతిపై విచారణ జరిపించాలని వారు కోరారు. 22వ అంశం శివరామరాజు అనే కాంట్రాక్టరుకు ఈఎండీ చెల్లింపుకు ప్రతిపాదనపై వాడ్రేవు సాయిప్రసాద్‌తోపాటు ఇతర కౌన్సిలర్లు మాట్లాడుతూ 1996 నుంచి పనిచేసిన కాంట్రాక్టర్లుకు ఈఎండీ చెల్లించాల్సిఉందని ఇటీవల పనిచేసిన కాంట్రాక్టరుకు చెల్లించాల్సిన పనిఏమిటని ప్రశ్నించారు. ఈ అంశాన్ని వాయిదా వేయాలని కౌన్సిలర్లు ఏకపక్షంగా నిర్ణయించారు. దీంతో అంశాన్ని వాయిదా వేశారు. పట్టణంలో కుక్కలు బెడద ఎక్కువగా ఉందని సుప్రీం కోర్టు మార్గదర్శకాలు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని జనసేన కౌన్సిలర్లు అంకం శ్రీనివాస్ కోరారు.

రామచంద్రపురాన్ని కాకినాడజిల్లాలో కలిపేందుకు కౌన్సిల్ మద్దతు

సమావేశం ముగిసే సమయానికి అఖిలపక్ష జేఏసీ నాయకులు కౌన్సిల్ సమావేశంలోకి వచ్చారు. రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడజిల్లాలో కలుపుతూ తీర్మానించాలని కోరారు. దీనిపై మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కౌన్సిలర్లు రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడజిల్లాలో కలిపే అంశాన్ని ప్రస్తావించారు. రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని ప్రతిపాదనకు కౌన్సిలర్లు అందరూ మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా జేఏసీ నాయకులు చైర్‌పర్సన్ శ్రీదేవి, కౌన్సిలర్లును సత్కరించారు. సమావేశంలో కమీషనర్ టి.రాజేశ్వరరాజు, వైస్‌చైర్మన్లు చింతపల్లి నాగేశ్వరరావు, కొలమూరి శివాజీ, కౌన్సిలర్లు పాల్గొన్నారు. అఖిలపక్ష జేఏసీ నాయకులు మాగాపు అమ్మిరాజు, బి.సిద్దూ, మల్లిడి హరినాథరెడ్డి, గొలపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న వరద ఉధృతి

కపిలేశ్వరపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : తగ్గినట్లే తగ్గిన గోదావరి నదికి వరద ఉధృతి గంటగంటకూ పెరుగుతున్న నేపథ్యంలో నదీపరివాహక ప్రాంతాలైన తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, పల్లపులంక, అద్దంకివారిలంక గ్రామాల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పలుచోట్ల లంకపొలాల్లోకి మరలా వరదనీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పలు లోతట్టు ప్రాంతాల్లో ఇటుక బట్టీలకు నీరు చేరింది. వరద ఉధృతి కారణంగా కపిలేశ్వరపురం, కోరుమిల్లి, తాతపూడి పుష్కరఘాట్లకు నీరు చేరింది.

జలదిగ్బంధంలోనే తోకలంక

ఆలమూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలస్థాన అగ్రహారంవద్ద కాజ్‌వే గోదావరి వరదనీటిలో కొట్టుకుపోవడంతో రావులపాలెం మండలం ఊబలంక శివారు గ్రామమైన తోకలంక గత ఎనిమిది రోజులుగా గోదావరి వరదనీటిలోనే ఉండటంతో రాకపోకలు పడవలపైనే సాగించాల్సి వస్తోంది. తోకలంకకు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం గోదావరి ఎగువ ప్రాంతంలో వరద నీరు పెరుగుతుండటంతో లంక గ్రామాలకు ఆందోళన మొదలైంది. మళ్లీ వరదనీటి ఎప్పటికి తగ్గుతుందో తెలియక ఆందోళన చెందుతున్నారు.

బాల్యవివాహాలు సమాజాభివృద్ధికి అడ్డంకి

● జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ ప్లీడర్ ప్రసన్న

కపిలేశ్వరపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) :బాల్యవివాహాలు సమాజాభివృద్ధికి అడ్డంకిగా మారుతాయని ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బి.వి. ప్రసన్న అన్నారు. శుక్రవారం మండలంలోని అచ్యుతాపురం పీహెచ్‌సీలో జిల్లా న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు, ఆలమూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా బాల్యవివాహాలపై అవగాహన సదస్సులో మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహం జరిగితే ఆడపిల్లల విద్య ఆగిపోవడంతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందన్నారు. అలాంటి వివాహాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డా. కుమారి, దీపిక, న్యాయవాదులు కె. ధనరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి వైసీపీ నాయకులకు కనిపించదా?

● సాక్షి పత్రికలో అవాస్తవాలపై టీడీపీ నాయకుల మండిపాటు

కె.గంగవరం, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలో మండలంలో చేసిన అభివృద్ధి వైసీపీ నాయకులకు కనిపంచడంలేదాని టీడీపీ మండల నాయకులు అన్నారు. శుక్రవారం పుంత రోడ్ల విషయమై సాక్షి పత్రికలో రాసిన అవాస్తవాలపై మండిపడ్డారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలసి పార్టీ మండల అధ్యక్షుడు మేడిశెట్టి రవికుమార్ పత్రికా సమావేశం నిర్వహించి వివరాలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.5.30 కోట్లతో కోటనుంచి కోటిపల్లి -గంగవరం వరకూ ఉన్న రహదారిని, దంగేరు నుంచి రాజవైరి వరకు, గంగవరం నుంచి పెద్దింశెట్టివారిపాలెం వరకు, పేకేరు నుంచి నల్లచెరువు పుంత వరకు, యర్రపోతవరం నుంచి రాళ్లగుంట వరకు, భట్లపాలిక నుంచి నేరెళ్లంకవరకూ బీటీ రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. అదేవిధంగా రూ.15లక్షలతో పాణింగపల్లి నుంచి టేకిడ్రైన్ వరకూ డబ్ల్యూబీఎం రోడ్డు, ఎంజీఎన్ఆర్‌జీఎస్ నిధులతో 79సీసీ రోడ్లు నిర్మించామని చెప్పారు. సాక్షి పత్రికలో ముఖ్యంగా పుంతరోడ్ల విషయమై అవాస్తవాలు చెప్పారు. ప్రాధాన్యతాక్రమంలో పుంత రోడ్లు అభివృద్ధి చేస్తాము. ఇకనైనా వాస్తవాల గ్రహించాలని వైసీపీ నాయకులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ సలాది రమేష్, యర్రపోతవరం డీసీ అధ్యక్షులు నిడదవోలు సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు గొడవర్తి రామకృష్ణ, ములకల రామచంద్రరావు, దంగేటి నాగేశ్వరరావు, తరపట్ల ఆనందరావు, కొత్తపల్లి మొరర్జీ పాల్గొన్నారు.

వాడపల్లిలో ప్రవేశపెట్టిన బ్యాటరీ కార్లు


వాడపల్లి వెంకన్న ఆలయంలో నడుపుతున్న బ్యాటరీ వాహనాలు

ఆత్రేయపురం, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుమల తరహాలో బ్యాటరీ కార్లను ప్రవేశపెట్టారు. దాత సమకూర్చిన బ్యాటరీకార్ల ద్వారా ప్రయాణికులను స్వామివారి క్షేత్రానికి తీసుకువస్తున్నారు. ఆర్టీసీ బస్సులు, వివిధ వాహనాలు శ్రీనివాస ప్రాంగణంలో పార్కింగ్ నిర్వహిస్తున్నారు. ఆప్రాంగణం నుంచి, అమ్మ వారి ఆలయంవద్ద నుంచి వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు, చంటి పిల్లల తల్లులను ఆయా ప్రాంతాల నుంచి బ్యాటరీ కార్ల ద్వారా స్వామివారి సన్నిధికి తీసుకువస్తున్నారు. తిరుమల తరహాలో బ్యాటరీ కార్లు భక్తులతో రయ్ రయ్ మని వాడపల్లిలో పరుగులు పెడుతున్నాయి.

ద్వారపూడి వస్త్ర మార్కెట్ కార్యవర్గం ఎన్నిక


ద్వారపూడి మహాత్మాగాంధీ వస్త్ర మార్కెట్‌కమిటీ కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

మండపేట, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం ద్వారపూడిలో వున్న మహాత్మా గాంధీ వస్త్రమార్కెట్ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం సంఘ గౌరవాధ్యక్షుడు పంతంగి బోస్ అధ్యక్షతన జరిగింది. ఆయన సారథ్యంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. సంఘం అధ్యక్షుడిగా చిక్కాల శ్రీనువాసరావు, ఉపాధ్యక్షుడిగా వాసా వీరేంద్రకుమార్, పల్లా సన్యాసిరావు, కార్యదర్శిగా తిప్పాని సింహాచలం, జాయింట్ కార్యదర్శిగా వాకచర్ల నాగభాస్కరరావు, ట్రెజరర్‌గా బీరక తమ్మయ్యస్వామిలు ఎన్నికయ్యారు. శుక్రవారం అసోసియేషన్ భవనంలో ప్రమాణస్వీకారం జరిగింది. నూతన కార్యవర్గంను పలువురు వ్యాపారులు అభినందించారు.

అన్నదాన ట్రస్టుకు రూ.50,116 విరాళం

ఆత్రేయపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పురాణ ప్రసిద్ధిగాంచిన ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో చేపడుతున్న అన్నదాన ట్రస్టుకు ఎన్ఆర్ఐ చుండి వెంకట్, నాగకళ్యాణి దంపతులు రూ.50,116 విరాళం సమర్పించారు.రాజమహేంద్రవరానికి చెందిన చింతా శ్రీనివాసరెడ్డి రూ.11,106, గుంటూరుకు చెందిన రావిపూడి వెంకటసుబ్బారావు రూ.10,116, తెలంగాణ రాష్ట్రం హనుమకొండకు చెందిన టి.నిఖిల్ రూ.10,010 విరాళాలు సమర్పించారు. దాతలకు ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి స్వామివారి చిత్రపటాలు అందించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాదం స్వీకరించారు.

కోడి పందాలపై దాడి

● ఐదుగురు వ్యక్తుల అరెస్టు

కె.గంగవరం, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుడుపూరులో కోడి పందాలపై దాడిచేసి ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పామర్రు ఎస్.ఐ. ఎస్.కె.జానీబాషా చెప్పారు. గురువారం కుడుపూరు గ్రామంలో కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు తమకు సమాచారం వచ్చింది. దీంతో తమ సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను, రెండు కోడిపుంజులను, 5200 నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

క్రీడలు మానసిక ధృడత్వాన్ని పెంపొందిస్తాయి

కొత్తపేట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక, మానసిక ధృడత్వాన్ని పెంపొందిస్తాయని వీకేవీ ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు పేర్కొన్నారు. శుక్రవారం భారత హాకీ ఒలింపిక్ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ టి.రమాదేవి, పీడీ డాక్టర్ కె.అంకమరావు, కె.సత్యనారాయణ, డీసీహెచ్ నాగారాణి కె.కనకరాజు, కె.సుకన్య పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల తీరుపై
విజిలెన్స్ విచారణ చేపట్టాలి

● కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ల


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఆగస్టు29 (ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపల్ కార్యాలయంలో ఏసీలకే పరిమితమై అవినీతిలో మునిగి తేలుతున్న ఉద్యోగులపై అధికార ప్రతిపక్ష పార్టీలకు చెందిన కౌన్సిలర్‌లు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యంగా కార్యాలయంలో రెవెన్యూ విభాగంలో ఆర్‌వో, ఆర్ఐలు మున్సిపల్ దుకాణాలు అద్దెలు వసూలు విషయంలో దుకాణాల యజమానుల నుంచి లంచాలు వసూలుచేసి వారివద్ద నుంచి అద్దెలు వసూలు చేయకుండా వెసులుబాటు కల్పించటంవల్ల అద్దెల బకాయిలు పేరుకుపోతున్నాయని దాని వల్ల మున్సిపల్ ఆదాయానికి గండిపడుతుందని మున్సిపల్ వైస్‌చైర్మన్ పిల్లి గణేశ్వరరావు ఆరోపించిన అంశంపై ఎమ్మెల్యే వేగుళ్లతో సహా సభ్యులు ధ్వజమెత్తారు. అసలు మున్సిపల్ అద్దెలకు సంబంధించిన సమాచారం తెలపాలని ఎమ్మెల్యే వేగుళ్ల ఆ శాఖాధికారుల ను కోరగా వారు నీళ్ల నమిలారు. అదేసమయంలో ఆర్‌వో, ఆర్.ఐల అవినీతి భాగోతంపై ఆయన ధ్వజమెత్తారు. ప్రతినెలా దుకాణాల అద్దెల వివరాలు కౌన్సిల్ దృష్టికి తీసుకురావాలని కౌన్సిల్ తీర్మానించినప్పటికీ ఎందుకు ఈ అంశం తీసుకురా లేదని ఆయన ప్రశ్నించటంతో వారు నీళ్లనమిలారు. రెవెన్యూ విభాగం తీరుపై విజిలెన్స్ విచారణచేస్తే సంగతి తేలుతుందని ఆయన అన్నారు. మండపేట మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ పి.నూకదుర్గారాణి అధ్యక్షతన శుక్రవారం వాడివేడిగా సాగింది. మండపేట మున్సిపల్ వాటర్ వర్క్సుకు చెందిన 18.5ఎకరాల స్థలంలో కోట్లు విలువచేసే 18 సెంట్లస్థలం ఆక్రమణలకు గురైందని దానిపై సర్వే నిర్వహించి చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరటం దానికి పట్టణ ప్రణాళిక అధికారి రమ్య సమాధానం ఇస్తూ తమకు రెవెన్యూ సర్వేయర్ సహకరిం చటంలేదని సమాధానం ఇవ్వటంతో ఎమ్మెల్యే వేగుళ్ల కౌన్సిల్ సమావేశంలో నుంచి మండపేట తహసీల్దార్‌కు ఫోన్‌చేసిన సర్వేపై మాట్లాడారు. న్యాయస్థానంలో కేసు పెండింగ్‌వున్న నేపథ్యంలో సర్వే తాము చేయలేమని తహసీల్దార్ తేల్చిచెప్పారు. దానిపై కమీషనర్ రంగారావు సమాధానం ఇస్తూ రెవెన్యూశాఖకు సంబంధించి సర్వే విషయంలో తమకు వారు సహకరించటం లేదని సర్వేకోసం జిల్లా సర్వేయర్‌కు రాశానంటూ సమాధానం చెప్పారు. ఇదే అంశంపై ఇద్దరు అధికారులు, చైర్‌పర్సన్ కూర్చుని సర్వే అంశం తేల్చాలని వేగుళ్ల సూచించారు. అలాగే గత 2019-20లో ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అంచనాలు తయారు చేసిన ప్రైవేటు ఏజెన్సీకి చెల్లించాల్సిన బిల్లును కౌన్సిల్ దృష్టికి తీసుకురాగా కౌన్సిల్ ఐదేళ్లనుంచి ఏంచేశారంటూ ఏకగ్రీవంగా బిల్లు చెల్లింపు కుదరదంటూ తిరస్కరించింది. కౌన్సిల్‌లో పలు అంశాలపై చర్చ జరిగింది. అలాగే మున్సిపల్ కౌన్సిలర్‌లు స్టడీటూర్‌కు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై కమిషనర్ రంగారావు సమాధానం ఇస్తూ కౌన్సిల్ తీర్మానం చేసి ఇస్తే ఉన్నతాధికారులకు పంపిస్తామని చెప్పారు. సమావేశంలో సభ్యులు పలు అంశాలను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చి చర్చించారు. అలాగే అంజెండాలోని పలు అంశాలను ఆమోదించారు. పలు అంశాలను తిరస్కరించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వేగుళ్ల నారయ్యబాబు, కౌన్సిలర్‌లు కాళ్లకూరి స్వరాజ్యభవాని, శిరంగుజ్యోతి, మలసాని సీతామహాలక్ష్మి, పోతంశెట్టి ప్రసాద్, కాశిన కాశివిశ్వనాధం, చుండ్రు చినసుబ్బారావుచౌదరి, యారమాటి గంగరాజు, చిట్టూరి సతీష్, గ్రంధి శ్రీనివాస్, కొవ్వాడ బేబీతోపాటు మున్సిపల్ డీ.ఇ. శ్రీనివాస్. మేనేజర్, వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

జనార్ధనస్వామి ఆలయంలో 'ఆదిత్య' డైరెక్టర్ లక్ష్మీరాజ్యం పూజలు


జనార్ధనస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆలమూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఆలమూరులోని శ్రీదేవి భూదేవి సమేత జనార్ధనస్వామి ఆలయంలో ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్, మాజీ ఎమ్మెల్సీ నల్లమిల్లి శేషారెడ్డి సతీమణి నల్లమిల్లి లక్ష్మీరాజ్యం శుక్రవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన లక్ష్మీరాజ్యంకు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, సభ్యులు ద్విభాష్యం సత్యలక్ష్మీ, చిన్నం సుబ్బలక్ష్మి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆమెకు వేదపండితులు వేదాశీర్వాచనాలు అందించారు.

విద్యార్థి దశ నుంచి సైన్సుపట్ల అవగాహన ఉండాలి

మండపేట, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు సైన్సు పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా సైంటిఫిక్ మోటివేషన్ ఇన్‌స్ట్రక్టర్ సంకురాత్రి శ్రీనివాసరావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం ఏడిద జిల్లాపరిషత్ పాఠశాలను సందర్శించారు. హెచ్‌ఎం చింతా జయలక్ష్మి అధ్యక్షతన సైంటిఫిక్ మోటివేషన్ ఇన్‌స్ట్రక్టర్ శ్రీనివాసరావు హాజరై విద్యార్థులకు శాస్త్రీయ సాంకేతికత సైన్సు గురించి వివరించారు.

పసలపూడి హైస్కూల్‌లో సైన్స్ ల్యాబ్ ప్రారంభం

రాయవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో దాత చింతా వెంకటరెడ్డి(బాబులు) వితరణతో రూ.82వేల విలువైన సైన్స్ ప్రయోగాల పరికరాలను కొనుగోలుచేసి పాఠశాలకు అందజేయగా శుక్రవారం సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. పాఠశాలలో విద్యార్థులు సైన్స్ ప్రయోగాలు నిర్వహించేందుకుగాను సైన్స్ పరికరాలు కొనుగోలుచేసి దాత పాఠశాలకు అందించారు. దాత బాబులు కుమారుడు సుహాస్‌రెడ్డి చేతుల మీదుగా సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. గ్రామానికి చెందిన వేమనరెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి పాఠశాలకు సౌండ్ సిస్టం కొనుగోలు నిమిత్తం రూ.50వేలు అందజేశారు. దాతల తోడ్పాటు అభినందనీయమని హెచ్‌ఎం ఆదినారాయణ కొనియాడారు. పసలపూడి సహకారసంఘం మాజీ చైర్మన్ చింతా రామ్మోహనరెడ్డి, పోతంశెట్టి సాయిరామ్మోహనరెడ్డి, మల్లిడి రామారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలు ఆర్థికంగా రాణించాలి

● లీడ్ బ్యాంకు మేనేజర్ ప్రవీణ్

ఆత్రేయపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా మరిన్ని అడుగులు వేస్తూ రాణించాలని లీడ్ బ్యాంకు మేనేజర్ ప్రవీణ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఫుడ్ ప్రాసెసింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. పూతరేకులు తయారు చేసే మహిళలకు వర్క్‌షాపు నిర్వహించారు. పూతరేకుల తయారీలో నూతన పద్ధతిని ప్రవేశపెట్టామని ఎలక్ట్రానిక్ మిషన్ ద్వారా పూతరేకుల తయారీ విధానాన్ని డెమో ద్వారా స్వయంశక్తి సంఘాలకు వివరించారు. వివిధ రకాల ఆహార ఉత్పత్తులు తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఫుడ్ ప్రాసెసింగ్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళలకు ఈ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరామన్, స్టేట్ బ్యాంకు మేనేజర్ ప్రవీణ్‌కుమార్, ఫుడ్ ప్రాసెసింగ్ మేనేజర్ మారుతీ, ర్యాలి బ్యాంకు మేనేజర్ నరసింహ, డీఆర్పీలు ఈశ్వర్, రమ్య, వెలుగు ఏపీఎం గంగాధర్, అధిక సంఖ్యలో డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.